ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	536.50 (181.1140)	1,18,979	4,646
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.63 (3.60)	12.84	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	152.754 (17.980)	నిల్	3,000

చికెన్ ధరలు	లైవ్ : రూ.125	డ్రెస్ : రూ.190	స్కిన్‌లెస్ : రూ.210

వడివడిగా.. కృష్ణమ్మ రాక



సాగర్ జలాశయం ప్రస్తుత పరిస్థితి

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ, బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద రాక కొనసాగుతుండగా, నీటి మట్టం వడివడిగా పెరుగుతోంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు 18 ఏళ్ల తర్వాత జూన్ నెలలోనే వరద రాక ప్రారంభమైంది. దీంతో జూన్ 30వ తేదీ నుంచి శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజు రోజుకూ క్రమంగా పెరుగుతూ బుధవారం సాయంత్రానికి 536.90 అడుగులకు (181.9292 టీఎంసీలకు) చేరింది.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

- సాగర్‌కు కొనసాగుతున్న వరద
- ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో క్రస్ట్ గేట్లను తాకనున్న నీటిమట్టం
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో ప్రాజెక్టు నీటిమట్టం క్రస్ట్ గేట్లను (546 అడుగులు) తాకనుంది. గత ఏడాది సాగర్‌కు జూలై 29వ తేదీన వరద రాక ప్రారంభం కాగా, ఈ ఏడాది నెల రోజుల ముందుగానే జూన్ 30వ తేదీ నుంచే వరద రాక మొదలైంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వానాకాలం సాగుకు ఆయకట్టుకు సాగు నీటిని ఆగస్టు నెలలో విడుదల చేశారు. కాగా ఈ ఏడాది జూలై మూడో వారంలో సాగు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ఆయకట్టు రైతులు భావిస్తున్నారు.

ఆయకట్టులో 6.50లక్షల ఎకరాల సాగు.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో మొత్తం 6.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గత ఏడాది ఆగస్టు 2వ తేదీన సాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయగా, ఈ ఏడాది జూలై మూడో వారంలోనే సాగునీరు వస్తుందని ఆయకట్టు రైతులు ఆనందంగా ఎదురుచూస్తున్నారు.

536.90 అడుగులుగా నీటిమట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 536.90 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా, 181.9292 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ నుంచి ఎడమ కాల్వకు 3,146 క్యూసెక్కుల నీటిని, జంటనగరాల తాగు నీటి..

- మిగతా 8వ పేజీలో...

ఐదేళ్లలో ఆగస్టులోనే క్రస్ట్ గేట్ల ఎత్తివేత

సాగర్ క్రస్ట్ గేట్లను ఏటా ఆగస్టు నెలలోనే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశా రు. 2019 నుంచి 2024 వరకు నీటి విడుదల ఇలా..

సంవత్సరం	క్రస్ట్ గేట్లు ఎత్తిన తేదీ	నీటిమట్టం (అడుగుల్లో)
2019	ఆగస్టు 12	588.00
2020	ఆగస్టు 21	585.40
2021	ఆగస్టు 01	587
2022	ఆగస్టు 11	585.60
2023	గేట్లు ఎత్త లేదు	
2024	ఆగస్టు 5	585.20

పదేళ్లలో ఎడమ కాల్వకు వానాకాలం సాగునీటి విడుదల ఇలా..

సంవత్సరం	నీటి విడుదల	నాటి నీటిమట్టం (అడుగుల్లో)
2014	ఆగస్టు 6	515
2015	విడుదల లేదు	510
2016	ఆగస్టు 26	514
2017	అక్టోబరు 31	576
2018	ఆగస్టు 23	555
2019	ఆగస్టు 11	556
2020	ఆగస్టు 7	556
2021	ఆగస్టు 5	585
2022	ఆగస్టు 31	555
2023	క్రాప్‌హాలిడే	506
2024	ఆగస్టు 2	585

చెర్వుగట్టు టెండర్ షరతుల్లో దిద్దుబాటు!



చెర్వుగట్టుపై టెండర్ వేలం నిర్వహిస్తున్న దేవస్థాన అధికారులు (ఫైల్)

- 72 గంటల్లో మొత్తం డబ్బు చెల్లించాలని నిబంధన
- ఇకపై అన్ని టెండర్లకు ఇదే నిబంధన విధిస్తామన్న ఈవో
- టెండర్ బకాయిలపై వస్తున్న విమర్శలతో మార్పు

నార్కట్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు దేవస్థానం టెండర్ బకాయిల వసూళ్ల విషయంలో ఇటీవల వచ్చిన విమర్శలు, ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో టెండర్ నిబంధనలు మారుస్తూ ఈవో సిరికొండ నవీన్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఏ టెండర్‌నైనా దక్కించుకున్నవారు తొలుత 50శాతం చెల్లించి మిగతా మూడు లేదా నాలుగు సమాన వాయిదాల్లో టెండర్ కాలపరిమితి ముగిసే నాటికి చెల్లించే వెసులుబాటు ఉండేది. కానీ, కరోనా అనంతరం దేవస్థానంలో టెండర్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని టెండర్‌లు దక్కించుకున్న వేలందారులు బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చూపారు. అంతేగాక బకాయి చెల్లింపులకు అదనపు సమయం కోసం రాజకీయ ఒత్తిడి చేయించడం...

- మిగతా 8వ పేజీలో...

ఎంపీడీవోలు పనితీరును మెరుగుపర్చుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పథకాల్లో పురోగతి తీసుకువచ్చేలా ఎంపీడీవోలు పనితీరును మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వానాకాలంలో రెసిడెన్షియల్ పాఠశాలల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత గ్రామపంచాయతీలదేనన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉపాధి హామీ పథకం కింద ప్రతీ పాఠశాలలో సోక్ పిట్లు నిర్మించాలని, నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీ గార్డెన్లు చేపట్టాలని, అందుకు మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇంటింటికీ మొక్కలు ఇచ్చే కార్యక్రమాన్ని మూడు, నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఆగస్టు 15 నాటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామీణ అభివృద్ధి శాఖ పూర్తిచేయాలని, అందుకు ఈ నెలాఖరులోపు గుంతలు తవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన తోటల పెంపకం లక్ష్యం 3వేల ఎకరాలకు, ఇప్పటివరకు 1,237 ఎకరాలు మాత్రమే గుర్తించారన్నారు. సాధ్యమైనంత త్వరగా లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ రాజకుమార్, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో కలెక్టర్ తనిఖీలు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం తనిఖీ చేశారు. తొలుత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీచేసి సమస్యలను ప్రధానోపాధ్యాయుడు రాములును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సంభాషించారు. మీ-సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రేషన్‌కార్డుల్లో అదనపు సభ్యుల నమోదు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సెక్షన్‌ను, మిత్ర ట్రేడర్స్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఈవో బొల్లారం భిక్షపతి, జేడీఏ శ్రవణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి చరిత, శైలజ, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో కూకుట్ల నర్సింహ, ఏవో గౌతమ్, ఆర్ఐ తరుణ్‌కుమార్ ఉన్నారు.

ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యానికి మేలు

(ఆంధ్రజ్యోతి, చిట్యాల): ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ఆర్గానిక్ రైతుబజార్ ఏర్పాటుకు చిట్యాల శివారులో స్థలాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సాగవుతున్న ఆర్గానిక్ పంటల ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేందుకు జాతీయ రహదారి పక్కన రైతుబజార్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. చిట్యాల శివారులోని 471సర్వేనెంబర్‌లో స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణనాయక్ ఉన్నారు.

ప్రజా సమస్యలు చర్చించేందుకు అసెంబ్లీ వేదిక

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను చర్చించేందుకు అసెంబ్లీ వేదికని, దమ్ముంటే కేసీఆర్, కేటీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ సవాల్ విసిరారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం పోయాక కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయలు దండుకుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపారని ఆరోపించారు. ఆంధ్రా ప్రాంతానికి నీటిని అప్పగించేందుకు ఆ రాష్ట్ర మంత్రి రోజా ఇంట్లో రొయ్యల కూర, చేపల పులుసు తిన్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. బనకచర్ల, కృష్ణ జలాలు, ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా మాట్లాడాలన్నారు. బీఆర్‌ఎస్ హయంలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అన్ని పేపర్లు లీక్ చేశారని, నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఈనెల 14న తుంగతుర్తి నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, కాంగ్రెస్ ప్రతీ గ్రామంలో పేదలకు ఇళ్లు మంజూరు చేసిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి, పెరిక వినాయకరాజు, పోలే జయకుమార్, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, పాదం అనిల్, మంచి కట్టి సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించడానికి చర్యలు

సీఐ శ్రీను నాయక్



సాగర్ పైలాన్ కాలనీలో ప్రమాదకర మలుపును పరిశీలిస్తున్న సీఐ శ్రీను నాయక్, డీటీఆర్‌బీ, ఎన్‌హెచ్‌ఏ అధికారులు

నాగార్జునసాగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సాగర్‌కు వచ్చే రహదారిలో మూలమలునుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారంచేందుకు చర్యలు తీసుకుంటామని సాగర్ సీఐ శ్రీను నాయక్ తెలిపారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ల ఆదేశాల మేరకు జిల్లా ట్రాఫిక్ రోసోర్స్ పర్సన్,(డీటీఆర్‌బీ) ఆర్‌అండఃబీ అధికారులతో కలిసి సాగర్ హిల్‌ఖాలనీ,పైలాన్ కాలనీలల్లో జాతీయ రహదారివెంట ఉన్న మూల మలుపునలు పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మూల మలుపుల వద్ద రోడ్డును వెడల్పు చేయాలని అలాగే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు.అనంతరం సాగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సమీక్షా నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఆర్‌బీ అంజయ్య, నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్ రఘురాం, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెతో కేంద్రానికి కనువిప్పు కలగాలి

కార్మిక సంఘాల నేతలు



సార్వత్రిక సమ్మెలో భాగంగా నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పలు కార్మిక సంఘాలు

నల్లగొండ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, వెంటనే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న డిమాండ్ చేశారు. బుధవారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో ర్యాలీ, గడియారం సెంటర్‌లో నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తెచ్చిందన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ ద్వారా ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్‌ను చట్టబద్ధం చేసి రెగ్యులర్ ఉద్యోగుల భద్రతకు ముప్పు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రేడ్ యూనియన్లను, ఉద్యోగుల కార్మికుల సంఘటిత శక్తిని బలహీనపరుస్తోందని అన్నారు. సమ్మె ద్వారా కనువిప్పు కలిగి వెంటనే కేంద్రం ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలని, లేదంటే తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్. రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ.మోయినుద్దీన్, గుర్రం వెంకట్‌రెడ్డి, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



గురుపౌర్ణమికి ముస్తాబు

అన్ని రకాల టీకాలు అందించాలి

డీఐవో పద్మ



వైద్యులతో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఐవో పద్మ

కేతేపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చేవారికి అన్ని రకాల టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) పద్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని నిరోధక టీకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతీ బుధ, శనివారాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి అన్ని రకాల వ్యాక్సిన్లు ఇవ్వాలని సూచించారు. సకాలంలో గర్భిణులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేయాలన్నారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది వారి వ్యాక్సినేషన్ క్యారియర్‌లో తగిన మోతాదులో శీతలీకరణ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యులు అర్చన, దివ్య, సిబ్బంది సైదులు, యాదయ్య, తదితరులు ఉన్నారు.

త్వరితగతిన సేవలు అందించాలి

రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ మధుసూధన్‌రెడ్డి

నల్లగొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ, విక్రయదారులకు త్వరితగతిన సేవలను అందించాలని మేడ్చల్ రంగారెడ్డి డీఐజీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ బుకింగ్‌ల ద్వారా డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. అదే విధంగా రికార్డులను భద్రపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలను పరిష్కరించాలని డీఐజీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ ఎం.రవీందర్‌రావు, సబ్‌రిజిస్ట్రార్లు రఘువర్ధన్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలుచేయాలి

టీఎస్‌యూటీఎఫ్

చింతపల్లి, వేములపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పీఆర్సీ అమలుచేయలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం చింతపల్లి, వేములపల్లి మండలంలోని వివిధ పాఠశాల్లో టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు వెంటనే పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు అర్హత కల్పించాలని కోరారు. మండలంలోని తీదేడు (వెంకటంపేట), ఘడియగౌరారం, చింతపల్లి, కుర్మేడ్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిలువేరు నారాయణ, ముసుగు ఆనంద్, బాబు, సంఘం వేములపల్లి మండల అధ్యక్షుడు భైరం బాలరాజు, ప్రధాన కార్యదర్శి మాలోతు నగేష్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం బూరుగు రమేష్, నాయకులు గనిమల్ల శ్రీరాములు, గోన దేవ్‌కుమార్, ఇరిగి స్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

సంఘాల్లోకి మహిళలను ఆహ్వానించాలి

అదనపు డీఆర్డీవో శ్రవణ్‌కుమార్



మహిళా సంఘాల సభ్యులతో అదనపు డీఆర్డీవో శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఏ సంఘంలో లేని మహిళలను ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు సంఘాల్లోకి ఆహ్వానిస్తామని అదనపు డీఆర్డీవో ఎం.శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కళాజాతను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు మహిళలందరికీ సంఘాల్లో చేరుస్తామన్నారు. కిశోర బాలికలకు, దివ్యాంగులకు, వృద్ధులకు సంఘాలు ఏర్పాటు చేసి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణానికి ప్రభుత్వం నుంచి వచ్చిన వడ్డీ రాయితిని పంపిణీ చేస్తామన్నారు. గత ఏడాది ఫిబ్రవరి తరువాత రుణం తీసుకొని ప్రమాదానికి గురై, లేదా సాధారణ మరణం చెందిన మహిళల కుటుంబాలకు ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులు అందజేస్తామన్నారు. తీసుకున్న రుణాలను రికవరీ చేయడం, రుణం పొంది విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తున్న మహిళలకు సన్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు బాషపాక చంద్రశేఖర్, ప్రభాకర్, సీసీలు సైదులు, నాగయ్య, స్వాగత్‌రావు, కళాజాత సభ్యులు ప్రతాప్, మల్లిక, సైదమ్మ, కొండలు, శ్రీను, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో చోరీ

చిలుకూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని సురమాంబ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. గుడి తాళాలు పగలకొట్టి ఆలయంలోకి ప్రవేశించి హుండీని బయటకు తీసుకెళ్లి పగలకొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం దేవాలయం బయట హుండీ పగలకొట్టి ఉండడాన్ని గమనించిన దేవాలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాటిచెట్టు పైనుంచిపడి గీత కార్మికుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కేతేపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు పైనుంచిపడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆల్దాస్ జానయ్య(40) కల్లుగీత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం తాటిచెట్ల నుంచి కల్లు తీయడానికి తాటిచెట్టు ఎక్కే క్రమంలో కాళ్లకు ఉండే గుదె జారిపోవడంతో పట్టుతప్పి మోకు సహా చెట్టుపై నుంచి కిందకు జారాడు. ఈ క్రమంలో మోకు జానయ్య మెడకు బిగుసుకుని మృతిచెందాడు. జానయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామస్థుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐ అనిల్‌రెడ్డి పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. జానయ్య భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

నేరేడుచర్ల, జూలై9(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నలుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు. రెండు కోళ్లు, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణి మృతిపై విచారణకు ఆదేశం

భువనగిరి (కలెక్టరేట్), జూలై 9(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యసేవల్లో నిర్లక్ష్యంతో మంగళవారం గర్భిణి మృతిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. విచారణ అధికారిగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ యశోదను నియమించారు. ఆస్పత్రి నిర్వాహకులు, అనుమతి పొందిన వైద్యులు, చికిత్స చేసిన డాక్టర్లు, మృతిచెందిన గర్భిణి బంధువులను విచారించి సంఘటనపై పూర్తి నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో మనోహర్ తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రి యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల మేరకే వైద్యం అందించాలని, అనుమతి అర్హత లేకుండా వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

నలుగురు ఆర్ఎంపీలపై కేసు నమోదు

దేవరకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలో నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు రాము ఫిర్యాదు మేరకు నలుగురు ఆర్ఎంపీలపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. పట్టణంలోని సాయిరాం క్లినిక్ వైద్యుడు రాజేశ్వర్‌రావు, ఆకాష్, ఐ ఆసుపత్రి నిర్వాహకుడు రమేష్, ఆల్ఫాక్లినిక్ ఆర్ఎంపీ వైద్యుడు జహంగీర్, మారుతి క్లినిక్ నిర్వాహకుడు సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి : 10 మంది అరెస్ట్

దేవరకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలోని వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు మహిళలను, ఎనిమిది మంది విటులను అదుపులోకి తీసుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. దేవరకొండలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు మహిళలను, ఎనిమిది మంది విటులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలు అదృశ్యం.. కేసు నమోదు

మోత్కూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన వంకి ముత్తమ్మ(60) 12 రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్త మల్లయ్య బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు తెలిపారు. సుమారు 10 ఏళ్ల క్రితం వారి కుమారుడు మృతిచెందాడని అప్పటి నుంచి ఆమె కొంత మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పడప్పుడు ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి ఒకట్రెండు రోజులకు తిరిగి వచ్చేదని, గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె ఇంతవరకు తిరిగి రాలేదని తెలిపారు. బంధువుల ఇళ్లకు వెళ్లిందేమోనని వెతికామని అయినా కనిపించలేదన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


శంకర్ మృతదేహం

మోత్కూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలో జామచెట్లబావి క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాల మండలం వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి శంకర(45) మృతిచెందాడు. శంకర్ మోత్కూరు వచ్చి టీవీఎస్ ఎక్సల్ మోపెడ్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గుండాలకు చెందిన మైనర్ బాలుడు బైక్‌పై అధిక వేగంగా వచ్చి అతన్ని ఢీకొన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న శంకర్‌ను 108లో మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని డాక్టర్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. శంకర్ తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకటేశ్వర్లు తెలిపారు. గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం జనగామ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని..


వర్ధన్‌బాబు మృతదేహం

మోతె: డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన బుర్రి వర్ధన్‌బాబు(22), మరో యువకుడు తరుణ్ హైద్రాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్తుండగా మోతె మండలకేంద్రంలో సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బుర్రి వర్ధన్‌బాబు తలకు గాయమైంది. నేషనల్ హైవే సిబ్బంది సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు, బైక్ వెనుక కూర్చున్న తరుణ్‌కు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ. యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని..

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ప్లాట్‌ఫాం-2 లైన్‌ను దాటుతున్న క్రమంలో గుర్తుతెలియని మహిళను హైదరాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 45ఏళ్ల వయసు కలిగిన మహిళ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

తక్కువ ధరకు సిమెంట్ సరఫరా చేయించిన ఆర్డీవో

మోత్కూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలోని పలు మండలాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో సిమెంట్, స్టీలు వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారని, ఇసుక ఎక్కువ ధరకు సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ధరలు పెంచకుండా పర్యవేక్షించే బాధ్యతను అధికారులకు అప్పగించగా వారు వ్యాపారులు, ట్రాక్టర్ల యజమానులతో సమావేశాలు నిర్వహించి, అధిక ధరలు విక్రయించవద్దని చెబుతున్నా తీరు మారడం లేదు. మూడు రోజుల క్రితం భువనగిరి ఆర్డీవో అడ్డగూడూరు మండలంలోని మానాయకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అక్కడ ఎనిమిది ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తాపీ మేస్త్రీలు, సిమెంట్, స్టీలు వ్యాపారులు, ఇసుక రవాణాదారులు ఎక్కువ ధరలు తీసుకోకుండా రేట్లు నిర్ణయించామని చెప్పారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు రామచంద్రయ్య ఇక్కడ సిమెంటు డీలర్ రూ.350లకు ఒక బస్తా చొప్పున వి క్రయిస్తున్నారని ఆర్డీవో కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆర్డీవో తాను భువనగిరి డీలర్ ద్వారా తక్కువ ధరకు సిమెంటు పంపిస్తానని చెప్పారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు బుధవారం భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి సిమెంటు బస్తా రూ.275 చొప్పున 260 బస్తాలు సిమెంటు భువనగిరి డీలర్ ద్వారా మానాయకుంటకు పంపించారు. 260 బస్తాలను ఎనిమిది మంది లబ్ధిదారులు తీసుకున్నారు. ఒక్కో బస్తాకు రూ.75 చొప్పున మిగలడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు ఆర్డీవోకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన వాటికనూ వదల్లేదు

● మిర్యాలగూడలోని మహాప్రస్థానం చోరీ ● దహనసంస్కారాల కోసం ఉపయోగించే ఐరన్ గ్రిల్స్ ఎత్తుకెళ్లిన దొంగలు


మిర్యాలగూడలోని హిందూ శ్మశానవాటిక(మహాప్రస్థానం)

దొంగతనం చేసి శ్మశానంలో దాక్కునే వాళ్లను చూశాం.. చోరీ చేసిన సొత్తును బొందలగడ్డలో దాచి పెట్టే వాళ్ల గురించి విన్నాం.. కానీ శ్మశాన వాటికలో దహన సంస్కారాల కోసం ఉపయోగించే పరికరాలనూ వదల్లేదు దొంగలు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శ్మశానవాటికలో జరిగిన ఈ విచిత్ర దొంగతనం గురించి విని పట్టణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

● (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణంలోని షాబూనగర్ హిందూ స్మశాన వాటికను 2023లో రూ.5.05 కోట్లతో మహాప్రస్థానం పేరుతో అభివృద్ధి పనులు చేపట్టారు. అప్పుడు అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వమూ మారింది. ఇప్పటి వరకు 90శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇందులో ఎలక్ట్రికల్ క్రిమేషన్ యూనిట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకు సుమారు రూ.55లక్షలు అవుతుందని ప్రతిపాదనలు రూపొందించారు. అప్పటికే అంచనా వ్యయానికి అదనంగా రూ.70లక్షలు వెచ్చించిన కాంట్రాక్టర్ సంస్థ బిల్లుల చెల్లింపు కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూనే ఉంది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి మహాప్రస్థానాన్ని ఆధీనంలోకి తీసుకోవాల్సిన మునిసిపాలిటీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. రాజధాని తరహాలో ఆధునిక హంగులతో, పచ్చని పచ్చిక బయళ్లతో విల్లాలను తలపించేలా నిర్మించిన మహాప్రస్థానం నిర్వహణ లేమితో పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోయింది.

చోరీకి గురైన పరికరాలు

స్మశాన వాటికలో శవాలను దహనం కోసం వినియోగించే ఐరన్ గ్రిల్స్, దహన సంస్కారాల కోసం బంధుమిత్రులు తిరిగేందుకు బీడుతో చేసిన ఐరన్ ప్లేట్లను ఈ నెల 7వ తేదీ రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. శవాలను దహనం చేసేందుకు ఏర్పాటు చేసిన మూడు ప్లాట్‌ఫామ్‌ల గ్రిల్స్‌తో పాటు డ్రైయిన్‌లపై ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ దొంగతనానికి గురైనట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుంది.

ఇప్పటికీ కాంట్రాక్టర్ నిర్వహణలోనే..

అత్యాధునికంగా అభివృద్ధి చేసిన మహాప్రస్థానాన్ని మునిసిపాలిటీ ఆధీనంలోకి చేసుకోవాల్సి ఉంది. అయితే నిధులు విడుదల కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో గుత్తేదారు సంస్థనే నిర్వహణ బాధ్యత తీసుకుంది. పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి ఆధీనం చేసుకోవాల్సిన తరుణంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. నాటినుంచి నేటి వరకు నిర్వహణంతా సదరు సంస్థే చేపడుతోంది. వాచ్‌మన్, వర్కర్ల వేతనాల నుంచి మొక్కల పెంపకం వరకు, విద్యుత్ బిల్లుల చెల్లింపుతో కలిపి నెలకు సుమారుగా రూ.లక్ష వెచ్చించాల్సి వస్తోందని కాంట్రాక్టర్ వాపోతున్నాడు.

మునిసిపాలిటీ అలసత్వం వీడాలి

పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా అదనపు ఏర్పాట్లు చేయాల్సిన పురపాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. షాబూనగర్ శ్మశాన వాటికను మహాప్రస్థానంగా అభివృద్ధి చేయడం హర్షనీయం. పనులు పూర్తయినప్పటికీ నిర్వహణ బాధ్యత చేపట్టకపోవడం సరికాదు. అందుకే దొంగతనాలు జరుగుతున్నాయి.

● చిలుకూరు శ్యాం, మిర్యాలగూడ.


దొంగతనానికి ముందు, తర్వాత ప్లాట్ ఫాంపై రెయిలింగ్ భాగం

ఆరోగ్యశ్రీ సేవల్లో చేతివాటం

● ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం నిర్వాకం
● ఆస్పత్రిలో అధికారులు విచారణ
● షోకాజ్ నోటీసులు జారీ


విచారణ నిర్వహిస్తున్న ఆరోగ్య జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శివప్రసాద్

మిర్యాలగూడ అర్బన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య చేసి బిల్లులు పొందుతూనే అదనపు వసూళ్లకు పాల్పడుతున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి వ్యవహారాన్ని అధికారుల బట్టబయలు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం డాక్టర్స్ కాలనీలోని రివర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ జిల్లా అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇన్‌పేషంట్ వార్డులో చికిత్సపొందుతున్న రోగులను ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై ప్రశ్నించగా ఆస్పత్రి యాజమాన్యం ప్రభుత్వం చెల్లించే బిల్లులతోపాటు అదనంగా బిల్లులు వసూలు చేస్తున్నట్లు అధికారుల వద్ద వాపోయారు. గుండె సంబంధిత జబ్బులకు అందించే వైద్యాన్ని బట్టి చేతివాటం ప్రదర్శిస్తున్నారని రోగుల బంధువులు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయ పరిస్థితిలో చికిత్స కోసం తీసుకొచ్చిన తాము వారిని ప్రాణాలతో దక్కించుకునేందుకు యాజమాన్యం విధించే షరతులకు తలొగ్గాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్సకోసం వచ్చిన రోగుల బంధువులను ఆరోగ్యశ్రీలో వేసే స్టంట్లు నాసిరకంగా ఉన్నాయని భయభ్రాంతులకు గురిచేసి ప్రైవేట్ స్టంట్లు వేస్తూ అదనపు బిల్లులు నొక్కేస్తున్నట్లు అధికారులు తమ తనిఖీలో గుర్తించారు. మేలిరకం కంపెనీ స్టంట్ల పేరుతో ఆరోగ్యశ్రీ వార్డులోని రోగుల నుంచి అదనపు వసూళ్లకు సంబంధించి బిల్లులు కూడా ఇవ్వడంలేదని పలువురు విచారణ అధికారులకు తెలిపారు. ఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలు, అదపను వసూళ్లపై రోగులు, వారి సహాయకుల నుంచి సేకరించిన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డు చేసుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం నిబంధనలు తుంగలో తొక్కి, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఆస్పత్రి యాజమాన్యానికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారం రోజుల్లోపు లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వాలని అధికారులు ఆదేశించారు.

మృతుడి బంధువుల ఫిర్యాదుతో..

ఈ నెల 1వ తేదీన ఆడవిదేవులపల్లి మండలం కొత్తనందికొండ గ్రామానికి చెందిన సుంకిశాల ముత్తయ్య(60) గుండెనొప్పితో రివర్ ఆస్పత్రిలో చేరగా, ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యసేవలు అందించాల్సిన ఆస్పత్రి యాజమాన్యం అదనపు డబ్బులు డిమాండ్ చేయగా, ఆ మొత్తం చెల్లించక పోవడంతో చికిత్సలో జాప్యం జరిగి మృతిచెందాడని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. ఆస్పత్రి యాజమాన్యం తీరుపై మృతుడి బంధువులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో చేపట్టిన తనిఖీలో ఆస్పత్రి బండారం బట్టబయలైంది. రోగి మృతికి ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యం కారణమని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చే వివరణ ఆధారంగా రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్టు పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శివప్రసాద్ తెలిపారు.

తాళాలు వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

● చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నేరస్తుల అరెస్టు ● 4.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటక్రైం, జూలై 9, (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.7 తులాల బంగారు ఆభరణాలు, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్నకుమార్ బుధవారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెన్‌పహాడ్ మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ఆటోడ్రైవర్‌గా పనిచేసే ఖమ్మంపాటి నాగేశ్వర్‌రావు, సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మామిడి జనార్దన్ కలిసి ఈ ఏడాది జూన్ 20 తేదీన మండల కేంద్రంలోని గుండపనేని వెంకట్రావ్ నివాసంలో తాళాలు పగలగొట్టి ఇంట్లో భద్రపరిచిన సుమారు 4.7 తులాల బంగారు ఆభరణాలు చోరీచేశారు. అదేవిధంగా ఈనెల 5న మండల పరిధిలోని దూపాడు గ్రామంలోని పత్తిపాక సైదులు నివాసంలో రూ.2 వేల నగదును అపహరించారు. చో చేసిన బంగారు ఆభరణాలను ఈనెల 9న సూర్యాపేటలో విక్రయించేందుకు కారులో బయలుదేరి సూర్యాపేటకు వెళ్తుండగా మండల పరిధిలోని అనంతారం క్రాస్‌రోడ్డు వద్ద మండల ఎస్ఐ గోపిక్రిష్ణ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చి కారు ఆపి తనిఖీ చేశారు. కారులోని బ్యాగులో బంగారు ఆభరణాలు లభించాయి. నేరస్తుల్లో ఒకరు పాత నేరస్తుడు కావడంతో అనుమానంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. చోరీలకు పాల్పడింది తామేనని చోరీ చేసిన బంగారు ఆభరణాలను విక్రయించేందుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద బంగారు ఆభరణాలు, కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ గురుకుల రాజశేఖర్, పెన్‌పహాడ్ ఎస్ఐ కస్తాల గోపిక్రిష్ణ ఉన్నారు.

భూములను సర్వే చేయాలి

తిరుమలగిరి(సాగర్), జూలై 9(ఆంధ్రజ్యోతి): తమ భూములను సర్వే చేయాలని నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలానికి చెందిన పలువురు నాయకులు సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను కోరారు. బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల సమస్యను పరిష్కరించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మండలంలో కొందరి భూములను సర్వే చేయలేదన్నారు. కొందరు రైతులు జీవనోపాధి కోసం వలస వెళ్లారని, అప్ప ట్లో వారి భూములను సర్వే చేయకపోడంతో పట్టాదారు పాస్ పుస్తకాలు పొందలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. ప్రస్తుతం వారి భూములను కూడా సర్వే చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి అర్హులైన రైతుల భూములను సర్వే చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యూత్ కాం గ్రెస్ నియోజకవర్గ నాయకులు మెరావత్ మునినాయక్, రైతులు పాండునాయక్, సత్యానాయక్, రంగా, ప్రభా, దస్రునాయక్, భీమా, బాలు, హన్మంతు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి స్థలం ఇవ్వాలి

మిర్యాలగూడటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని వాటర్‌ట్యాంక్‌తండా వాసులు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ సమీపంలో ఉన్న తండాలో పంచాయతీ భవనం లేక పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. తండాకు మునిసిపల్ వాటర్ ట్యాంక్ నుంచి నీటిని అందించడంతో పాటు పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో తండావాసులు శంకర్‌నాయక్, కృష్ణ, నాగరాజు, నాగులు, రామ్యా, బాలు, హన్మంతు, ఉమ పాల్గొన్నారు.

చెరువు పనుల్లో నాణ్యత పాటించాలి



చెరువుకు మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఈఈ రాములు.

మిర్యాలగూడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): చెరువు పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్వహించాలని నల్లగొండ జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ రాములు అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని దామెరబీమనపల్లి గ్రామశివారులోని మొండి కట్ట చెరువు మరమ్మతుల కోసం రూ.8లక్షల నిధులతో మంజూరైన పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు తూము అలుగు మరమ్మతుల పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెరువులో నీటి నిల్వ ఉంచడానికి పనులు చేస్తున్నామన్నారు. తూము, అలుగు వద్ద నిర్వహించే పనుల్లో నాణ్యత ప్రమాణాలతో చేయడం వల్ల నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కుంభం శ్రీనివాస్ రెడ్డి, మునగాల అంతిరెడ్డి, సూర్యయ, డీఈ వెంకటేశ్వర్లు ఏఈ శేఖర్ జిగేల్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎం. ప్రశాంత్, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దండెంపల్లిలో ఆగని మట్టి మాఫియా

● అధికారులు ఆదేశించారని అక్రమంగా మట్టి తరలింపు ● ఆర్డీవో కార్యాలయానికి అని చెప్పి ఫంక్షన్‌హాల్‌కు.. ● లస్కర్ అడ్డుకుంటున్నా ఆగని దందా



టిప్పర్ వాహనంలోకి మట్టి పోస్తున్న ఎక్స్‌కవేటర్

నల్లగొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామంలో మట్టి మాఫియా మళ్లీ రెచ్చిపోతోంది. 'కాల్వ మట్టి కాజేస్తున్నారు' శీర్షికన గత నెల 5వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి అడ్డుకున్నారు. ఇప్పుడు మళ్లీ చెలరేగిన మట్టి మాఫియా మట్టి తరలిస్తోంది. నల్లగొండ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయానికి మట్టి కోసం సంబంధిత శాఖ అధికారులు నీటి పారుదల శాఖ అధికారులకు కొన్ని ట్రిప్పుల మట్టికావాలని లేఖ రాయడంతో నీటి పారుదలశాఖ అధికారులు అనుమతిచ్చారు. ఇదే అదునుగా కొందరు అక్రమార్కులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని తరలించుపోయి విక్రయించుకుంటున్నారు. ఆర్డీవో కార్యాలయానికి పది ట్రిప్పులకు మించి అవసరం లేకున్నా అధికారుల ఆదేశాలంటూ వందలాది ట్రిప్పుల మట్టి తరలించడం గమనార్హం. నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిలో జిల్లాకేంద్రంలోని మర్రిగూడ బైపాస్ నుంచి పానగల్లు జంక్షన్‌కు మధ్య నూతనంగా నిర్మాణం చేస్తున్న ఓ ఫంక్షన్ హాల్‌కు మట్టి అక్రమంగా తరలించి వేల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి మాఫియా దందా తెలియడంతో బుధవారం నీటిపారుదలశాఖ అధికారులు ఓ లస్కర్‌ను నియమించారు. అయితే ట్రిప్పర్లలో మట్టి తరలిస్తున్న అక్రమార్కులు లస్కర్‌ను సైతం బెదిరించి పెద్దఎత్తున మట్టి తరలించారు. అదే విధంగా రైతులు మోటార్లను నడిపించుకోవడానికి వేసుకున్న విద్యుత్ వైర్లను సైతం తొలగించి మట్టి తరలిస్తున్నారు. ఈ విషయంపై నీటిపారుదలశాఖ ఏఈ రామచంద్రను వివరణ కోరగా లస్కర్‌ను నియమించామని, మట్టి అక్రమ రవాణ ఆగకుంటే పోలీస్ శాఖకు ఫిర్యాదు చేసి నిలిపివేయిస్తామని తెలిపారు. ఆర్డీవో ఆఫీసుకు మట్టి కావాలంటే అనుమతించిన విషయం వాస్తవమేనని, ఆ పేరిట ఎవరైనా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


మట్టి తరలిస్తున్న టిప్పర్ వాహనం

నేడు ధర్మచక్ర ప్రవర్తన దినం

● బుద్ధవనంలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు




బుద్ధవనం ఏరియల్ వ్యూ

నాగార్జునసాగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బుద్ధవనంలో గురుపౌర్ణమి(ఆషాఢ పౌర్ణమి) సందర్భంగా గురువారం ధర్మ చక్రప్రవర్తన దినం నిర్వహించనున్నారు. సిద్ధార్థుడు జ్ఞానోదయం పొందిన తర్వాత తాను నేర్చుకున్న సత్యాన్ని మొదటిసారిగా తన శిష్యులైన కొండన్న, మహానామా, వప్పా అస్సాజీ, బాద్ధియాలకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సారనాథ్ జింకల వనంలో ప్రవచించారు. బుద్ధుడి జీవితంలో ముఖ్యమైన ఐదు ఘట్టాల్లో ఒకటైన బుద్ధుని మొదటి ఉపన్యాసాన్ని ధర్మచక్ర ప్రవర్తన దినంగా నిర్వహిస్తారు. బుద్ధవనంలో గురువారం ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. మహాబోధ బుద్ధవిహార బౌద్ధ భిక్షువులతో పాటు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

గురుపౌర్ణమికి సాయిసన్నిధి ముస్తాబు



ముస్తాబైన సాయిబాబా ఆలయం




చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లిలోని షిర్డీ సాయి బాబా ఆలయం గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. నగర సంకీర్తన, కాకడ హారతి, గణపతి హోమం, పంచామృతాభిశేకం, యాగశాలలో పూర్ణాహుతి, భక్తులచే కోటి పుష్పార్చన నిర్వహించనున్నారు. నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మాచర్ల, గుంటూరు జిల్లాలు, పిడుగురాళ్లతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఛైర్మన్ మంచికంటి ధనుంజయ్య తెలిపారు.

హాలియా: నల్లగొండ జిల్లా హాలియాలోని షిరిడి సాయిమందిరం గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. తెల్లవారుజామున కాకడ హారతి, 108కళశాలతో బాబాకి కలశాభిషేకం, ఉదయం పుష్పార్చన, సంస్థాన్ హారతి, ధునిపూజ, భజన కార్యక్రమం, మధ్యాహ్నం హారతి, మధ్యాహ్నం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు తేలపోలు శేఖర్ తెలిపారు.

మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల చేయాలి

మిర్యాలగూడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన బిల్లులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ సభ్యుడు సైదానాయక్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని గాంధీపార్క్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగ అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు కూడా వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్, న్యూమాన్, అనిల్, మధు, సాయి పాల్గొన్నారు.







దేవాలయంలో విరాజిల్లని వెలుగులు

అంతర్జాతీయ క్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో విద్యుత్ వెలుగులు లేక గర్భాలయంలో అంధకారం నెలకొంది. వాటిని వెలిగించేందుకు జాప్యం చేస్తుండగా గర్భాలయ అందాలు వీక్షించలేకపోతున్నారు. సుదూర ప్రాంతా ల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వస్తుండగా బంగారు వర్ణంలో ఆకర్షణీయంగా కనువిందు చేసే గర్భాలయం వీక్షణకు దూరమతున్నారు. గర్భాలయంలో బిగించిన విద్యుత్ దీపాలు కొన్ని రోజులుగా వెలగడం లేదు. పైకప్పుకు ఏడు పెద్ద జూమర్ లైట్లకు మూడు, నాలుగు చిన్న వాటికి ఒకటే వెలుగుతోంది. అక్కడక్కడ పైకప్పు(రూఫ్ లైట్లు) దీపాలు మాత్రమే వెలుగుతూ కొంతమేర చీకటిని దూరం చేస్తున్నాయి. గర్భాలయంలోని భక్తులు ఎటు నుంచి వీక్షించినా చీకట్లోనే ఉన్నట్లు కనిపిస్తున్నారు.

- యాదగిరిగుట్ట, ఆంధ్రజ్యోతి

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, జూలై 9(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.11,19,0766ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా కొండకింద ఆధ్యాత్మిక వాడలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈవోలు గజ్వేల్లి రమేష్‌బాబు, ప్రతాప నవీన్‌కుమారశర్మ, గజ్వేల్లి రఘు, పర్యవేక్షకుడు దాసోజు నరేష్, నటరాజన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన, మాంగళ్యధారణ తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం నీరాజనమంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టెండర్ నిర్వహణ ఇలాగేనా?

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో టెండర్ నిర్వహణలో సమాచారం లోపించినట్లు టెండర్‌దారులు ఆరోపిస్తున్నారు. టెండర్ నిర్వహణకు గత నెల 28న విడుదల చేసిన పత్రికా ప్రకటన 30న ప్రచురితమైంది. కానీ, టెండర్ నిర్వాహణకు సంబంధించిన(స్వామివారి ప్రతిమలు) వివరాలు ప్రకటించినప్పటికీ తేదీ, సమయం, ప్రదేశం వంటి వివరాలు ప్రకటించకుండా కేవలం ఫోన్ నంబరు వెబ్‌సైట్ ప్రచురించగా బుధవారం నిర్వహించిన టెండర్‌తో ఔత్సాహిక టెండర్‌దారులు నిరుత్సాహ పడ్డారు. వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు పొందుపర్చినట్లు ఏఈవో గజ్వేల్లి రమేష్‌బాబు వివరణ ఇచ్చారు. రెండు, మూడు రోజుల నుంచి ప్రతి టెండర్ నిర్వాహణ మైక్ ద్వారా అనౌన్స్, వాట్సప్ గ్రూపు ద్వారా బహుళ ప్రచారం నిర్వహించే సంప్రదాయానికి విరుద్ధంగా గోప్యంగా టెండర్ నిర్వహణ పూర్తి చేయడంలో అధికారులు ఆసక్తి కనబర్చారని ఔత్సాహిక టెండర్‌దారులు వాపోయారు. ఆరు ఆఫ్‌లైన్, ఒకటి ఆన్‌లైన్ ద్వారా టెండర్లు సమర్పించగా ఆఫ్‌లైన్ నలుగురు, ఆన్‌లైన్ ఒక్కరు మాత్రమే టెండర్‌లో పాల్గొన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తికాక ఈవో నిర్ణయం కోసం ఫైల్ పెండింగ్‌లో ఉంది.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

నల్లగొండ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టిందని నాన్‌ఫామ్ ఏపీఎం అయోధ్య, నల్లగొండ ఏపీఎం వినోద అన్నారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని రాములబండ గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాల్లో నాలుగు రకాల సంఘాలను బలోపేతం చేయడానికి మహిళలను సంఘాల్లో చేర్పించడం, కిశోరబాలికలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంఘాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు తీసుకునేలా మహిళలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రమాదబీమా, రుణబీమాపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘంలో ఉన్న మహిళ ప్రమాదవశాత్తు మృతిచెందితే ఆ కుటుంబానికి రూ.10లక్షల బీమా వర్తిస్తుందన్నారు. రుణం తీసుకున్న మహిళ మృతిచెందితే తీసుకున్న రుణం మాఫీ చేస్తారని తెలిపారు. నల్లగొండ మండలంలోని 31 గ్రామాల్లో ఈనెల 16 వరకు ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ గీత, శారద, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లకే నటనలో నడకలు

వచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకుని టీవీ సీరియల్స్, సినిమాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు చైల్డ్ ఆర్టిస్టు మోక్షజ్ఞ. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన మోక్షజ్ఞకు ఆరేళ్ల వయస్సులోనే టీవీ సీరియల్‌లో అవ కాశం రావడంతో నటన ప్రారంభించి ఇప్పటి వరకు దాదాపుగా 12కు పైగా తెలుగు సినిమాల్లో నటించాడు. (ఆంధ్రజ్యోతి -మిర్యాలగూడ)

● చక్కని డైలాగ్ డెలివరీతో సీరియల్స్‌లో, సినిమాల్లో రాణింపు
● అగ్రహీరోల సరసన అవకాశాలు పొందుతున్న మోక్షజ్ఞ

అతిథితో కాసేపు..



ఆరేళ్ల వయసులోనే నటన రంగంలో అవకాశం రావడంతో టీవీ సీరియల్స్, సినిమాలు, టీవీ యాడ్స్‌తో 13 ఏళ్ల వయసులోనే తనకంటూ గుర్తింపును తెచ్చుకుంటున్నాడు బాల నటుడు మోక్షజ్ఞ. ఖమ్మంలో 8వ తరగతి చదువుతూనే వచ్చిన అవకాశాలను జారవిడుచుకోకుండా నటనతో ప్రేక్షకులను మెప్పించేందుకు కృషి చేస్తున్నాడు. మోక్షజ్ఞ తల్లిదండ్రులు లింగం సతీష్, అరుణ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇంట్లోనే గురువులు ఉండటం వల్ల వారి బోధనలతో చదువులోనూ మోక్షజ్ఞ ముందు వరసలో ఉన్నారు. మోక్షజ్ఞ అమ్మమ్మ ఊరు హుజూర్‌నగర్. ఖమ్మంకు చెందిన మిర్యాలగూడకు వచ్చిన సందర్భంగా మోక్షజ్ఞ 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

టీవీ సీరియల్‌తో ఆరంగేట్రం

సీరియల్స్‌ను నిర్మించే మన స్టూడియో అధినేత డీవై చౌదరి మోక్షజ్ఞ కు ఆరేళ్ల వయసులో 'కల్యాణి' టీవి సీరియల్‌లో బాలనటుడిగా చిన్న పాత్రకు అవకాశం కల్పించారు. ఏమాత్రం తడబాటు లేకుండా స్పష్టంగా డైలాగ్ డెలివరీ చేయడంతో పాటు డైరెక్టర్ సూచించిన విధంగా హావభావాలు వ్యక్తం చేయడంతో 'శ్రీమతి' సీరియల్‌లో లీడ్‌రోల్‌కు అవకాశం ఇచ్చి మోక్షజ్ఞలోని నటనకు మెరుగులు దిద్దారు. సినిమాల్లో అవకాశాలు వచ్చాయి.

అగ్రహీరోల సరసన



పుష్ప-2 సినిమా సన్నివేశంలో మోక్షజ్ఞ

తొలిసినిమా ప్రభాస్‌తో సలార్‌లో నటించారు. అల్లుఅర్జున్‌తో పుష్ప-2లో, నితీన్ సినిమా మాస్ట్రో, ఓరి దేవుడా, రైటర్ పద్మభూషణ్, రవికుల రఘురామ్ తదితర 12 సినిమాల్లో ఇప్పటి వరకు నటించారు. కొణిదెల ఉపాసనతో హెల్త్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ యాడ్‌లో, హనుమాన్ హీరో తేజాసజ్జాతో డ్రైఫ్రూట్‌కుసంబంధించిన యాడ్‌తో కలిసి 10 వరకు యాడ్స్ కూడా చేశారు.

మంచి నటుడిగా నిలవాలన్నదే లక్ష్యం

సీరియల్స్, సినిమాల్లోనూ మంచి అవకాశాలు వస్తున్నాయి. కొత్తగా రవితేజ సినిమాలో ఓ పాత్రలో నటిస్తున్నా. నటనతో పాటు చదువుపై దృష్టి సారిస్తున్నా. అమ్మనాన్నల ప్రోత్సాహంతో షూటింగ్ సమయాల్లో మిస్సైయిన పాఠాలను నేర్చుకుని తోటి విద్యార్థులతో పరీక్షల్లో పోటీ పడుతున్న. డ్యాన్స్ క్లాసులకు అటెండ్ అవుతున్నా. భవిష్యత్‌లో మంచి నటుడిగా నిలవాలన్నదే లక్ష్యం. సమాజంలో అర్హులకు, తలసేమియా బారిన పడిన పిల్లలకు సాయం చేస్తాను.

- మోక్షజ్ఞ

ప్రైవేటు నుంచి సర్కారు బడికి వలసలు

● సత్ఫలితం ఇచ్చిన బడిబాట
● నల్లగొండ జిల్లా పోతిరెడ్డిపల్లి పాఠశాలలో 60అడ్మిషన్లు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన బడిబాట సత్ఫలితాలనిస్తోంది. ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చేసిన ప్రచారం విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించారు. నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలం పోతిరెడ్డిపల్లి పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉండగా పిల్లలంతా ప్రైవేటు పాఠశాలలకు వెళ్లడంతో ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉండేవారు. దీంతో ఈ ఏడాది పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, తోటి ఉపాధ్యాయురాలు పద్మకళతో కలిసి ప్రైవేటు పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి 60 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. మూతపడే స్థాయికి వచ్చిన పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చిన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని బుధవారం ఉమ్మడి మండల ఎంఈవోలు వెంకటయ్య, సముద్రాల శ్రీనయ్య అభినందించారు.



పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

పూర్వ వైభవం దిశగా..

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు. దాతల సహకారంతో బడిలో సౌకర్యాలు మెరుగుపరిచారు. పాఠశాలలో బోధన, మధ్యాహ్న భోజనం ఎలా ఉందో చిన్నారుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏమైనా సమస్యలుంటే ఉపాధ్యాయులు,తల్లిదండ్రులతో చర్చించి నివృత్తి చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సహకారం అందిస్తాం..



పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరిగి విద్యార్థులకు పాఠశాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించాం. 57 మంది పిల్లలను ప్రైవేటు పాఠశాలకు వెళ్లకుండా సర్కారు బడిలో చేరే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. పాఠశాల బలోపేతానికి గ్రామస్థులందరి సహకారంతో ముందుకువెళ్తాం.విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై రప్పించాం. పాఠశాల అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తాం.

- వెంకటయ్య, ఎంఈవో పీఏపల్లి

పాఠశాలను బలోపేతం చేస్తాం



మూతబడే స్థాయికి వచ్చిన పాఠశాలకు కొత్తగా వచ్చి పూర్వ వైభవం తీసుకొచ్చాం. విద్యార్థుల భవిష్యతుకు భరోసా కల్పించాం. గ్రామస్థులు, తల్లిదండ్రులు తమపై నమ్మకంతో 57 మంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా విద్యార్థులను సర్కారు బడికి పంపించారు. మొత్తం 60 మంది విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన బోధన అందిస్తాం.

- విజయలక్ష్మి, హెచ్ఎం, పోతిరెడ్డిపల్లి

500 మార్కులు దాటితే విమాన ప్రయాణం

మర్రిగూడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2026 వార్షిక పరీక్షల్లో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు విమాన ప్రయాణం అవకాశం కల్పిస్తానని సామాజిక కార్యకర్త, పూర్వ విద్యార్థి నేర్లకంటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పాఠశాల విద్యార్థులకు ఆయనతో పాటు కళాదేవి మెమోరియల్ ట్రస్టు మోత్కుర్ నివాసి నవీన్ బ్యాగులు, బూట్లు, పాఠ్యపుస్తకాలు అందించారు. కాగా మేటి చందాపురం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కుం భం ప్రీతీ శ్రీనివాస్ రెడ్డి స్పందించి పాఠశాలకు రంగులతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 1.50 లక్ష అందిస్తానని ఆయన హామీనిచ్చారు. వ్యవసాయ పరపతి సంఘం ఛైర్మన్ బాలం నరసింహ స్పందిస్తూ 510 మార్కులు సాధించే విద్యార్థులకు రూ.10 వేలతో పాటు బహమతులు అందిస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శారద, శ్రీనివాస్, మధు, మాజీ సర్పంచి చిట్యాల సబితా యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి మమత, గోపాల్, మాకం చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడి పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్, నవీన్

108లో ప్రసవం

రాజాపేట,జూలై9(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం దూది వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ 108 అంబులెన్స్ లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాలు ఇలా. గ్రామానికి చెందిన గొట్టిపాముల మమతకు మంగళవారం పురిటి నొప్పులు రావడంతో రాజాపేట ప్రాథమిక కేంద్రానికి తీసుకెళ్లేందుకు సమాచారం అందజేశారు. రాజాపేట తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం జరిగింది. 108 అంబులెన్స్ ఈఎంటీ బత్తిని వెంకటేశ్, పైలట్ చిన్న కుమార్ ప్రసవం చేశారు. 2.5 కిలోల బరువుతో మమత మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం తెలిపారు. తల్లి బిడ్డలకు సకాలంలో సేవలు అందించిన 108 సిబ్బందిని గ్రామస్థులు ప్రశంసించారు.



శ్రమశక్తి అవార్డు ఇవ్వడం అభినందనీయం



మోత్కూరులో స్వర్ణకు రాష్ట్రస్థాయి శ్రమశక్తి అవార్డు అందజేస్తున్న సినీగేయ రచయిత వరంగల్ శ్రీనివాస్, మోత్కూరు అభినయ శ్రీనివాస్ తదితరులు

మోత్కూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రమజీవి బ్రహ్మచారి పేరున ఆయన కుమారుడు అభినయ శ్రీనివాస్ శ్రమశక్తి అవార్డు ఇవ్వడం అభినందనీయమని ప్రముఖ జానపద సినీగేయ రచయిత వరంగల్ శ్రీనివాస్ అన్నారు. సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్ బుధవారం తన తండ్రి బ్రహ్మచారి జ్ఞాపకార్థం నిర్వహించిన శ్రమశక్తి అవార్డు ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే కల్టివేటర్‌ను తయారు చేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన చిట్టోజు స్వర్ణకు శ్రమశక్తి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ తండ్రి బ్రహ్మచారి కష్టజీవి అని, ఎంతో కష్టపడి పలు కొత్త పరికరాలు తయారు చేసేవారన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఆయన జ్ఞాపకార్థం యేటా ఒకరికి ఆయన పేరున శ్రమశక్తి అవార్డు ఇస్తున్నామన్నారు. తొలుత బ్రహ్మచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అభినయ కళాసమితి ఉపాధ్యక్షుడు దొంతోజు సతీష్‌చారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మోత్కూరు మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి, గేయ రచయిత కోదారి శ్రీనివాస్, ప్రజాభారతి అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు, ఎస్ఎన్‌చారి, గుంటి దేవా, కాంబోజు మహేందర్, టి.ఉప్పలయ్య, ఎస్.భాస్కరాచారి, బోళ్ల హనుమంతు, బయ్యని వెంకటేశ్వర్లు, గాదె వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, గుండగోని రామచంద్రు, బయ్యని పిచ్చయ్య, జిల్లెపల్లి జానయ్య, పి.మరియన్న, దొంతోజు నర్సమ్మ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

- సార్వత్రిక సమ్మె విజయవంతం
- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో సమ్మె విజయవంతమైంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీలు, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. పోరాడి సా ధించుకున్న 29 లేబర్ చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్ర భుత్వం లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. పెట్టుబడిదారుల మెప్పు కోసం కేంద్రప్రభుత్వం కార్మికుల ను బలి చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థను ప్రైవేటు ప రం చేయవద్దని ఉద్యోగులు నినదించారు.

నల్లగొండలో విద్యుత్ ఉద్యోగులు సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఎన్.వెంకటయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలను, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పి.నాగేశ్వరరావు, చిట్యాల రాజు, "ఏ.వెంకటేశ్వర్లు, ఏ.ఫర్వేజ్, తిరుగుడు శ్రీనివాస్, పురం రాంబాబు, ఓ.సమ్మిరెడ్డి, ఏ.శ్రీనివాస్, ఏ.పాండు, బి.ముత్తయ్య, డి.కోటి, కె. శ్రీనయ్య, డీఈ టెక్నికల్ కృష్ణారావు, డీఈ కన్‌స్ట్రక్షన్స్ బి. వెంకటయ్య, డీఈ ఆపరేషన్స్ అన్నయ్య, ఏడీఈ డి.శంకరయ్య, ఏవోలు కె. రవి కృష్ణ, ప్రేమ మనోహరి, కె. బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండలో ఎల్‌ఐసీ నల్లగొండ బ్రాంచ్-2 ఎదుట ఉద్యోగులు ఎ నిరసన తెలిపారు. . ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రెసిడెంట్ పోలే లింగయ్య, సెక్రటరీ వేముల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు కరుణాకర్‌రావు, రమేష్, డివిజనల్ కౌన్సిల్ మెంబర్ క్రాంతి కుమార్, ట్రెజరర్ సత్యనారాయణ, యూనిట్ సభ్యులు రామయ్య చంద్రమోహన్, ఏజెంట్లు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి పట్టణంలో అసంఘటితరంగ కార్మికులు మునుగోడు రోడ్డు చౌరస్తా నుంచి నల్లగొండ రోడ్డు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, శ్రీరామోజు వెంకటేశ్వర్లు, చెర్కు పెద్దులు, దండు రవి, కల్లూరి కంఠమహేశ్వర్, ఆమనగంటి అయిలయ్య, శ్రీనివాస్, మహ్మద్‌అలీ పాల్గొన్నారు.

● నల్లగొండలో తెలంగాణ కో -ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అలీముద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ సుగుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి సింగం రాజు, జిల్లా అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి, సెంట్రల్ కమిటీ మెంబర్ మల్లికార్జున్‌రెడ్డి, రాగిణి ఉదయ్, రవిచంద్ర సంతోష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

● చిట్యాలలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ఆధ్వర్యంలో భారీర్యాలీ, సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నర్సింహ్మా, అరూరి శ్రీను, కత్తుల లింగస్వామి, మల్లం మహేష్ పాల్గొన్నారు. పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగిళ్ళ యాదయ్య, బర్రె సంజీవ పాల్గొన్నారు.

● కేతేపల్లిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.రాజు, సీహెచ్.లూర్దుమారయ్య, ఆదిమళ్ళ సుధీర్, కోట లింగయ్య, జి.శ్రీను, సీహెచ్ సత్తయ్య, వి.వెంకన్న పాల్గొన్నారు.

● నల్గొండ మండలంలోని అప్పాజీపేట, కంచనపల్లి తదితర గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కర్షకులు ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున సీఐటీయూ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, నలపరాజు సైదులు పాల్గొన్నారు.



కనగల్ మండల కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

● చండూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న, సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, అంబటి చిరంజీవి, కందాళ ప్రమీళ, వంటిపాక వెంకటేశ్వర్లు, చెట్టిపల్లి కాశీరాం, బొల్లికొండ లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో నిర్వహించిన సమ్మెలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, వేముల శంకర్, గుండ్లపల్లి వెంకన్న, యేశబోయిన వెంకన్న, బల్లెం నవనీత తదితరులు పాల్గొన్నారు.

● కనగల్‌లో నిర్వహించిన ర్యాలీలో ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, సీఐటీయూ మండల కన్వీనర్ కానుగు లింగస్వామి, సుల్తానా పాల్గొన్నారు.

● మునుగోడులో నిర్వహించిన నిరసన ర్యాలీలో గురిజ రామచంద్రం, బండ శ్రీశైలం, బొల్గూరి నర్సింహ చాపల శ్రీను, దుబ్బ వెంకన్న, ముత్యాలు, పాల్గొన్నారు.

● మర్రిగూడ బస్టాండ్ సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద పలు కార్మిక సంఘాల నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏపూరి యాదయ్య, సీపీఐ మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్,జక్కుల అంజయ్య, ఈదుల బిక్షంరెడ్డి, నిరంజన్, రామలింగచారి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మండలంలో ఎరువులకు లోటు లేదు

చంద్రిక, ఏవో, చండూరు



మండలంలో ఎరువులకు లోటు లేదని చండూరు మండల వ్యవసాయ అధికారి చంద్రిక అన్నారు. మండలంలో ఈ వానా కాలం 22,800 ఎకరాల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలి. బుధవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

(చండూరు రూరల్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: మండలంలో మొత్తం ఎన్ని ఎకరాల్లో పత్తి, వరి సాగు చేస్తున్నారు?

ఏవో: మండలంలో ఇప్పటి వరకు 22,800 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వర్షం లేనందున కొంత మంది రైతులు ఇంకా విత్తుకోలేదు. సరైన వర్షం పడితే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. నీటి లభ్యత ఆధారంగా మండలంలోని రైతులు 5వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: మండలంలో రైతులకు సరిపడా యూరియా, డీఏపీ ఉన్నాయా?

ఏవో: మండలంలో యూరియాకు ఎలాంటి లోటు లేదు. సుమారు 500 మెట్రిక్ టన్నుల వరకు యూరియా ఆయా ఫర్టిలైజర్ షాపుల్లో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇప్పటి వరకు ఎంతశాతం వర్షపాతం నమోదైంది.

ఏవో: మండలంలో ఇప్పటి వరకు 141.4 ఎంఎం. వర్షపాతం పడాల్సింది. కానీ 93.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. మొత్తంగా 34శాతం (లోటు) తక్కువ వర్షపాతం నమోదైంది.

ఆంధ్రజ్యోతి: రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ చేశారా?

ఏవో: ఇప్పటి వరకు మండలంలో దాదాపుగా అందరి ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ అయ్యాయి. కొంత మంది రైతులకు ప్రైవేట్ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న వారికి, బ్యాంకుల్లో సమస్యలు ఉన్న వారికి, కొత్త పాస్ బుక్ వచ్చిన కొంత మంది రైతులకు జమ కాలేదు. ఆర్‌బీఐ నుంచి కన్ఫర్మేషన్ అందిన వెంటనే వారికి కూడా జమ చేయడం జరుగుతుంది.

ఆంధ్రజ్యోతి: రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు

ఏవో: రైతులు ముఖ్యంగా యూరియా, డీఏపీ వాడకాన్ని తగ్గించాలి. మన భూముల్లో యూరియా, డీఏపీ శాతం అధికంగా ఉన్నందున ఎక్కువగా నానో డీఏపీ, నానో యూరియా వాడుకోవాలి. పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలి.

మంత్రి కోమటిరెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లగొండటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవరకొండ రోడ్డు వినాయక హౌసింగ్ బోర్డు కాలనీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటానికి దరఖాస్తుదారులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ప్లాట్ల కోసం గతంలో డబ్బులు క ట్టిన 90మందికి న్యాయం చేస్తానని మంత్రి వెంకట్‌రెడ్డి హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా కనగల్ మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, చిట్ల వెంకటేశం మాట్లాడుతూ వినాయక హౌసింగ్ బోర్డ్ కాలనీలో 15 సంవత్సరా ల క్రితం ప్లాట్ల కోసం 90 మంది డబ్బులు కట్టినా డ్రాలో పేరు రాలేదని తెలిపారు. దీంతో డబ్బులు కట్టిన వారంతా న్యాయపోరాటం చేస్తున్నారు. అధికారులతో మాట్లాడి వారికి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు. పాలకూరి వెంకటేశ్వర్లుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళి గౌడ్, అయితగోని కృష్ణగౌడ్, మారగోని రామచంద్రం, వేమిరెడ్డి భూపాల్‌రెడ్డి, కదిరె సైదులు, మర్రి రమేష్, నగేష్, బుర్రి వెంకట్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు



విద్యార్థులతో ఆర్మీ అధికారులు, ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

శాలిగౌరారం, జూలై 9(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌కు చెందిన 52 మంది విద్యార్థులు జూనియర్ ఎన్‌సీసీ విభాగానికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. తెలంగాణ బెటాలియన్ ఆర్మీ అధికారులు సుబేదార్ సత్పాల్ సింగ్, హవల్దార్ మహ్మద్ ఇబ్రహీం, రాజు బుధవారం తమ పాఠశాలకు వచ్చి 52మంది విద్యార్థులను జూనియర్ ఎన్‌సీసీకి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ 31(టీ) కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ లక్ష్మారెడ్డి పాఠశాలను సందర్శించి ఎన్‌సీసీ రికార్డులను పరిశీలించారు. దీంతో పాటు ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన టీఎస్‌సీ క్యాంపులో షూటింగ్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ శిక్షకురాలు సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

తిప్పర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కృషి చేయాలని నల్లగొండ జిల్లా కమ్యూనిటీ మొబైలేషన్ ఆఫీసర్ (సీఎంవో) కత్తుల రవీందర్ అన్నారు. మండల కేం ద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను, అదే విధంగా నూతనంగా నిర్మిస్తున్న భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తిప్పర్తి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెం చేలా చూసి మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట భవిత కేంద్రం ఇన్‌చార్జి ప్రణీత ఉన్నారు.

చెర్వుగట్టు టెండర్ షరతుల్లో దిద్దుబాటు!

(5వపేజీ తరువాయి)

తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ ప్రభావం మిగతా టెండర్‌లపై చూపడంతో బకాయిల జాబితా పెరిగింది. కొన్ని టెండర్‌ల కాలపరిమితి పూర్తయినా బకాయిలను సొమ్మును చెల్లించకుండా వ్యాపారాలు సాగలేదని, నష్టం వచ్చిందనే సాకులు చెబుతూ ఎగ్గొట్టే ప్రయత్నం చేశారు. బినామీల ద్వారా వేలంలో పాల్గొని వారు మళ్లీ హక్కులు పొందుతున్నారు. ఇదిలా ఉండగా, దేవస్థాన సిబ్బంది రాజకీయ జోక్యం ఉన్న టెండర్‌దారులతో ఒకలా, మిగతా వారితో మరోలా వ్యవహరించారనే విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో ఈవో దిద్దుబాటు చర్యలను చేపట్టారు.

తాజా టెండర్ నుంచే మార్పు

చెర్వుగట్టు గుట్టపై కొబ్బరికాయల విక్రయ హక్కు పొందేందుకు బుధవారం ఈవో కార్యాలయం వద్ద సీల్డ్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ తాజా టెండర్ షెడ్యూల్‌లోని నిబంధనలను మార్చారు. దాని ప్రకారం టెండర్ దక్కించుకున్నవారు 72 గంటల్లో సొమ్ము చెల్లించాలని షరతు విధించారు. దీంతో పాటు మరో రెండు చిన్న నిబంధనలను కూడా సవరించారు.

కొబ్బరికాయల విక్రయ వేలం వాయిదా

చెర్వుగట్టు గుట్టపై ఏడాది కాలపరిమితికి నిర్వహించిన కొబ్బరికాయల విక్రయ హక్కు వేలం వాయిదా పడింది. సరైన ధర రానందున వేలం నిబంధనల మేరకు వాయిదా వేస్తున్నామని, తదుపరి వేలం తేదీని ప్రకటిస్తామని ఈవో ప్రకటించారు.

అన్ని టెండర్లకూ ఇదే నిబంధన

దేవస్థానం పరిధిలో నిర్వహించే అన్ని టెండర్‌లకు ఇకపై కొత్త నిబంధన వర్తిస్తుంది. గతంలో టెండర్ దక్కించుకున్నవారు 50శాతం డబ్బులను చెల్లించి, మిగతా మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించాం. ఈ వెసులుబాటును కొందరు దుర్వినియోగం చేశారు. బకాయిలు చెల్లించకపోగా తిరిగి నిందలు వేశారు. అందుకే ఇకపై అన్ని టెండర్లకూ నూతన నిబంధనలు వర్తింపజేస్తాం.

- సిరికొండ నవీన్ కుమార్, ఈవో

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నల్లగొండటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని భారతీయ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూధన్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు అమ్మ పేరుతో మిరియాల కమలమ్మ వెంకటేశం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మిరియాల వెంకటేశం కమలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మిరియాల సోమయ్య, సుదర్శన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో భారతదేశం అగ్ర భాగాన ఉందని, ప్రజలకు స్వచ్ఛమైన గాలి సరైన వర్షం కురవడానికి వాతావరణ సమతుల్యత ఎంతో అవసరమన్నారు. నేడు జరుగుతున్న అనేక కార్యక్రమాల వలన చెట్లు నరికివేత అనివార్యమైన సందర్భంలో అంతకు రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. రాష్ట్రంలో విరివిగా మొక్కలు నాటి దేశానికే ఆదర్శంగా నిలపాలని సూచించారు. అనంతరం నాటిన మొక్కను అమ్మలాగా చూసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బీపంగి జగ్జీవన్, పట్టణ జనరల్ సెక్రటరీ మంగిలపల్లి కిషన్, నాయకులు కటకం శ్రీధర్, నరేందర్‌రెడ్డి, శ్యామల తారక్, మూడో సైదులు, పున్న రమేష్, గుండ్లపెల్లి శాంతి కుమార్, దాసరి వెంకన్న, దేవేందర్ పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

లబ్ధిదారులకు పింఛన్లు పెంచి ఇవ్వాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ

నల్లగొండ టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు, అన్ని రకాల పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. అధికారంలో వచ్చి ఏడాది దాటిన తర్వాత కూడా హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి పదవి భోగం అనుభవిస్తున్నాడే తప్ప పింఛన్‌దారుల కష్టాల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పింఛన్లు పెంచకపోతే లక్షలాది మంది పింఛన్‌దారులు కాంగ్రెస్ కు దూరమవుతారని అన్నారు. పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామని ప్రతీ గ్రామం నుంచి పింఛన్‌దారులు కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలంమాదిగ, నాయకులు మేడి శంకర్, కొమిరె స్వామి, మాచర్ల సుదర్శన్, కురుపాటి కమలమ్మ, బొజ్జ చిన్న, ప్రసాద్, మాడుపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ

వడివడిగా కృష్ణమ్మ రాక

(5వపేజీ తరువాయి)

అవసరాలకు ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,500 క్యూసెక్కులు, మొత్తం 4,646 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి, రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 1,17,868 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదలచేస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున సాగర్ నీటిమట్టం 503.30 అడుగులుగా (120.5754 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి, వరద కాల్వకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు.

ఏటా ఆగస్టులోనే నీటి విడుదల

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు ఏటా ఆగస్టు నెలలోనే సాగు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ హాలిడేగా ప్రకటించింది. దీంతో ఆ ఏడాది సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ ఆయకట్టులో బోర్లు, బావుల కింద సుమారు లక్ష ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో 6లక్షల ఎకరాలకు సాగునీరు లేక 2023లో బీళ్లువారాయి. 2024-25 వ్యవసాయ సంవత్సరంలో సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక జూలై నెలలో ప్రారంభం కావడంతో ఆగస్టు 2వ తేదీ నుంచి ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి



538.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాం. సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 8 టర్బైన్‌లు ఉన్నాయి. అందులో మొదటి టర్బైన్ సామర్థ్యం 110 మిలియన్ యూనిట్లు కాగా, మిగిలిన ఏడు టర్బైన్‌ల ఒక్కో దాని సామర్థ్యం 100.8 మిలియన్ యూనిట్లు. కాగా మొదటి టర్బైన్ మరమ్మతులు కొనసాగుతుండటంతో మిగిలిన ఏడు టర్బైన్‌లలో మంగళవారం రాత్రి 7 నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు విద్యుత్ ఉత్పత్తి చేశాం. ఏడు టర్బైన్ల ద్వారా 2.5మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాం. ఈ ఏడాది సాగర్‌కు ముందస్తుగా వరద రాక మొదలవడంతో విద్యుత్ ఉత్పత్తి పూర్తిస్థాయిలో చేస్తాం. మొద టి టర్బైన్ మరమ్మతులు ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తవుతాయి.

- మంగేష్ కుమార్, జెన్‌కో సీఈ

రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి : ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు గతుకుల మరమ్మతు పనులను ఎమ్మెల్యే వీరేశం బుధవారం ప్రారంభించారు. ఐదు రోజుల క్రితం నార్కట్‌పల్లిలో జరిగిన కార్యక్రమానికి గ్రామస్థులు హాజరై రోడ్డు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వరకు ఉన్న రోడ్డుపై ఉన్న గోతులన్నింటినీ పూడ్చాలని ఆదేశించారు. ఈ రోడ్డుపై గుంతలున్నాయనే ఫిర్యాదు మళ్లీ తన వద్దకు రాకుండా చూసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.



మరమ్మతు పనులను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ కృషి



చిట్యాలలో మొక్క నాటుతున్న ఏబీవీపీ నాయకులు

చిట్యాల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కో సం ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని ఏబీవీపీ నగర కార్యదర్శి కొంపెల్లి సూర్య అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం చిట్యాల మార్కెట్‌యార్డులో మొక్కలు నాటారు. సమాజంలో ఎన్నో నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను ఏబీవీపీ చేపడుతుందని, అలా గే విద్యార్థుల్లో జాతీయభావం నింపడానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పుల్లెంల గణేష్, శ్రీకాంత్, నరేష్, మధు, సంపత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి



మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానిస్తున్న దైద రవీందర్

నకిరేకల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొ మ్మగాని మహేష్‌కుమార్‌గౌడ్ సూచించినట్లు దైద రవీందర్ తెలిపారు. హైదరాబా ద్‌లో ఆయన్ను బుధవారం నకిరేకల్‌కు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

భూ భారతి అర్జీదారులకు నోటీసుల జారీ

మర్రిగూడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భూ భారతిలో భూ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు చేసుకున్న రైతులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూభారతి కార్యక్రమంలో పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో రైతులు వారి భూ అర్జీలకు బుధవారం నుంచి ఆయా గ్రామపంచాయతీ కార్యాలయం గోడలకు నోటీసులు అంటిస్తున్నారు. అంతేకాక నోటీసులకు నేరుగా రైతులకు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 1276 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వారం రోజుల్లో తమ వివరాలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆగస్టు 14వ తేదీ వరకు భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	536.50 (181.1140)	1,18,979	4,646
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.63 (3.60)	12.84	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	152.754 (17.980)	నిల్	3,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

వడివడిగా.. కృష్ణమ్మ రాక



సాగర్ జలాశయం ప్రస్తుత పరిస్థితి

- సాగర్‌కు కొనసాగుతున్న వరద
- ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో క్రస్ట్ గేట్లను తాకనున్న నీటిమట్టం
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ, బహుళార్థ సాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద రాక కొనసాగుతుండగా, నీటి మట్టం వడివడిగా పెరుగుతోంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు 18 ఏళ్ల తర్వాత జూన్ నెలలోనే వరద రాక ప్రారంభమైంది. దీంతో జూన్ 30వ తేదీ నుంచి శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం రోజు రోజుకూ క్రమంగా పెరుగుతూ బుధవారం సాయంత్రానికి 536.90 అడుగులకు (181.9292 టీఎంసీలకు) చేరింది.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో ప్రాజెక్టు నీటిమట్టం క్రస్ట్ గేట్లను (546 అడుగులు) తాకనుంది. గత ఏడాది సాగర్‌కు జూలై 29వ తేదీన వరద రాక ప్రారంభం కాగా, ఈ ఏడాది నెల రోజుల ముందుగానే జూన్ 30వ తేదీ నుంచే వరద రాక మొదలైంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వానాకాలం సాగుకు ఆయకట్టుకు సాగు నీటిని ఆగస్టు నెలలో విడుదల చేశారు. కాగా ఈ ఏడాది జూలై మూడో వారంలో సాగు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ఆయకట్టు రైతులు భావిస్తున్నారు.

ఆయకట్టులో 6.50లక్షల ఎకరాల సాగు.

నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలో మొత్తం 6.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గత ఏడాది ఆగస్టు 2వ తేదీన సాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయగా, ఈ ఏడాది జూలై మూడో వారంలోనే సాగునీరు వస్తుందని ఆయకట్టు రైతులు ఆనందంగా ఎదురుచూస్తున్నారు.

536.90 అడుగులుగా నీటిమట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 536.90 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 50 టీఎంసీలు కాగా, 181.9292 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ నుంచి ఎడమ కాల్వకు 3,146 క్యూసెక్కుల నీటిని, జంటనగరాల తాగు నీటి..

- మిగతా 8వ పేజీలో...

ఐదేళ్లల్లో ఆగస్టులోనే క్రస్ట్ గేట్ల ఎత్తివేత

సాగర్ క్రస్ట్ గేట్లను ఏటా ఆగస్టు నెలలోనే ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశా రు. 2019 నుంచి 2024 వరకు నీటి విడుదల ఇలా..

సంవత్సరం	క్రస్ట్ గేట్లు ఎత్తిన తేదీ	నీటిమట్టం (అడుగుల్లో)
2019	ఆగస్టు 12	588.00
2020	ఆగస్టు 21	585.40
2021	ఆగస్టు 01	587
2022	ఆగస్టు 11	585.60
2023	గేట్లు ఎత్త లేదు	
2024	ఆగస్టు 5	585.20

పదేళ్లలో ఎడమ కాల్వకు వానాకాలం సాగునీటి విడుదల ఇలా..

సంవత్సరం	నీటి విడుదల	నాటి నీటిమట్టం (అడుగుల్లో)
2014	ఆగస్టు 6	515
2015	విడుదల లేదు	510
2016	ఆగస్టు 26	514
2017	అక్టోబరు 31	576
2018	ఆగస్టు 23	555
2019	ఆగస్టు 11	556
2020	ఆగస్టు 7	556
2021	ఆగస్టు 5	585
2022	ఆగస్టు 31	555
2023	క్రాప్‌హాలిడే	506
2024	ఆగస్టు 2	585

చెర్వుగట్టు టెండర్ షరతుల్లో దిద్దుబాటు!



చెర్వుగట్టుపై టెండర్ వేలం నిర్వహిస్తున్న దేవస్థాన అధికారులు (ఫైల్)

- 72 గంటల్లో మొత్తం డబ్బు చెల్లించాలని నిబంధన
- ఇకపై అన్ని టెండర్లకు ఇదే నిబంధన విధిస్తామన్న ఈవో
- టెండర్ బకాయిలపై వస్తున్న విమర్శలతో మార్పు

నార్కట్‌పల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు దేవస్థానం టెండర్ బకాయిల వసూళ్ల విషయంలో ఇటీవల వచ్చిన విమర్శలు, ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో టెండర్ నిబంధనలు మారుస్తూ ఈవో సిరికొండ నవీన్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఏ టెండర్‌నైనా దక్కించుకున్నవారు తొలుత 50శాతం చెల్లించి మిగతా మూడు లేదా నాలుగు సమాన వాయిదాల్లో టెండర్ కాలపరిమితి ముగిసే నాటికి చెల్లించే వెసులుబాటు ఉండేది. కానీ, కరోనా అనంతరం దేవస్థానంలో టెండర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని టెండర్లు దక్కించుకున్న వేలందారులు బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చూపారు. అంతేగాక బకాయి చెల్లింపులకు అదనపు సమయం కోసం రాజకీయ ఒత్తిడి చేయించడం...

- మిగతా 8వ పేజీలో...

ఎంపీడీవోలు పనితీరును మెరుగుపర్చుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ పథకాల్లో పురోగతి తీసుకువచ్చేలా ఎంపీడీవోలు పనితీరును మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వానాకాలంలో రెసిడెన్షియల్ పాఠశాలల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత గ్రామపంచాయతీలదేనన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉపాధి హామీ పథకం కింద ప్రతీ పాఠశాలలో సోక్ పిట్లు నిర్మించాలని, నీటి సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీ గార్డెన్లు చేపట్టాలని, అందుకు మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇంటింటికీ మొక్కలు ఇచ్చే కార్యక్రమాన్ని మూడు, నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఆగస్టు 15 నాటికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామీణ అభివృద్ధి శాఖ పూర్తిచేయాలని, అందుకు ఈ నెలాఖరులోపు గుంతలు తవ్వాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన తోటల పెంపకం లక్ష్యం 3వేల ఎకరాలకు, ఇప్పటివరకు 1,237 ఎకరాలు మాత్రమే గుర్తించారన్నారు. సాధ్యమైనంత త్వరగా లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, డీపీవో వెంకయ్య, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ రాజకుమార్, డీఈవో భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో కలెక్టర్ తనిఖీలు

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం తనిఖీ చేశారు. తొలుత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీచేసి సమస్యలను ప్రధానోపాధ్యాయుడు రాములును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో సంభాషించారు. మీ-సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రేషన్‌కార్డుల్లో అదనపు సభ్యుల నమోదు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సెక్షన్‌ను, మిత్ర ట్రేడర్స్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఈవో బొల్లారం భిక్షపతి, జేడీఏ శ్రవణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి చరిత, శైలజ, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో కూకుట్ల నర్సింహ, ఏవో గౌతమ్, ఆర్ఐ తరుణ్‌కుమార్ ఉన్నారు.

ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యానికి మేలు

(ఆంధ్రజ్యోతి, చిట్యాల): ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ఆర్గానిక్ రైతుబజార్ ఏర్పాటుకు చిట్యాల శివారులో స్థలాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సాగవుతున్న ఆర్గానిక్ పంటల ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేందుకు జాతీయ రహదారి పక్కన రైతుబజార్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. చిట్యాల శివారులోని 471సర్వేనెంబర్‌లో స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ కృష్ణనాయక్ ఉన్నారు.

ప్రజా సమస్యలు చర్చించేందుకు అసెంబ్లీ వేదిక

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నల్లగొండ టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను చర్చించేందుకు అసెంబ్లీ వేదికని, దమ్ముంటే కేసీఆర్, కేటీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ సవాల్ విసిరారు. బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం పోయాక కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయలు దండుకుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపారని ఆరోపించారు. ఆంధ్రా ప్రాంతానికి నీటిని అప్పగించేందుకు ఆ రాష్ట్ర మంత్రి రోజా ఇంట్లో రొయ్యల కూర, చేపల పులుసు తిన్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. బనకచర్ల, కృష్ణ జలాలు, ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా మాట్లాడాలన్నారు. బీఆర్ఎస్ హయంలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అన్ని పేపర్లు లీక్ చేశారని, నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఈనెల 14న తుంగతుర్తి నియోజకవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, కాంగ్రెస్ ప్రతీ గ్రామంలో పేదలకు ఇళ్లు మంజూరు చేసిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నాయకులు కత్తుల కోటి, పెరిక వినాయకరాజు, పోలే జయకుమార్, మామిడి కార్తీక్, గాలి నాగరాజు, పాదం అనిల్, మంచి కట్టి సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించడానికి చర్యలు

సీఐ శ్రీను నాయక్



సాగర్ పైలాన్ కాలనీలో ప్రమాదకర మలుపును పరిశీలిస్తున్న సీఐ శ్రీను నాయక్, డీటీఆర్‌బీ, ఎన్‌హెచ్‌ఏ అధికారులు

నాగార్జునసాగర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సాగర్‌కు వచ్చే రహదారిలో మూలమలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటామని సాగర్ సీఐ శ్రీను నాయక్ తెలిపారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ల ఆదేశాల మేరకు జిల్లా ట్రాఫిక్ రోసోర్స్ పర్సన్,(డీటీఆర్‌బీ) ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి సాగర్ హిల్‌ఖాలనీ,పైలాన్ కాలనీలల్లో జాతీయ రహదారివెంట ఉన్న మూల మలుపునలు పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మూల మలుపుల వద్ద రోడ్డును వెడల్పు చేయాలని అలాగే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు.అనంతరం సాగర్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సమీక్షా నిర్వహించారు. కార్యక్రమంలో డీటీఆర్‌బీ అంజయ్య, నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్ రఘురాం, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెతో కేంద్రానికి కనువిప్పు కలగాలి

కార్మిక సంఘాల నేతలు



సార్వత్రిక సమ్మెలో భాగంగా నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పలు కార్మిక సంఘాలు

నల్లగొండ రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, వెంటనే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న డిమాండ్ చేశారు. బుధవారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో ర్యాలీ, గడియారం సెంటర్‌లో నిరసన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తెచ్చిందన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ ద్వారా ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్‌ను చట్టబద్ధం చేసి రెగ్యులర్ ఉద్యోగుల భద్రతకు ముప్పు తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రేడ్ యూనియన్లను, ఉద్యోగుల కార్మికుల సంఘటిత శక్తిని బలహీనపరుస్తోందని అన్నారు. సమ్మె ద్వారా కనువిప్పు కలిగి వెంటనే కేంద్రం ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలని, లేదంటే తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. సలీం, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎస్.రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ.మోయినుద్దీన్, గుర్రం వెంకట్‌రెడ్డి, దండెంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల టీకాలు అందించాలి

డీఐవో పద్మ



వైద్యులతో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఐవో పద్మ

కేతేపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చేవారికి అన్ని రకాల టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) పద్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని నిరోధక టీకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతీ బుధ, శనివారాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి అన్ని రకాల వ్యాక్సిన్లు ఇవ్వాలని సూచించారు. సకాలంలో గర్భిణులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేయాలన్నారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది వారి వ్యాక్సినేషన్ క్యారియర్‌లో తగిన మోతాదులో శీతలీకరణ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యులు అర్చన, దివ్య, సిబ్బంది సైదులు, యాదయ్య, తదితరులు ఉన్నారు.



గురుపౌర్ణమికి ముస్తాబు

త్వరితగతిన సేవలు అందించాలి

రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ మధుసూధన్‌రెడ్డి

నల్లగొండ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ, విక్రయదారులకు త్వరితగతిన సేవలను అందించాలని మేడ్చల్ రంగారెడ్డి డీఐజీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్లాట్ బుకింగ్‌ల ద్వారా డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. అదే విధంగా రికార్డులను భద్రపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలను పరిష్కరించాలని డీఐజీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ ఎం.రవీందర్‌రావు, సబ్‌రిజిస్ట్రార్లు రఘువర్ధన్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలుచేయాలి

టీఎస్‌యూటీఎఫ్

చింతపల్లి, వేములపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పీఆర్సీ అమలుచేయలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం చింతపల్లి, వేములపల్లి మండలంలోని వివిధ పాఠశాల్లో టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు వెంటనే పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు అర్హత కల్పించాలని కోరారు. మండలంలోని తీదేడు (వెంకటంపేట), ఘడియగౌరారం, చింతపల్లి, కుర్మేడ్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మమ్మరంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కోట్ల యాదగిరి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిలువేరు నారాయణ, ముసుగు ఆనంద్, బాబు, సంఘం వేములపల్లి మండల అధ్యక్షుడు భైరం బాలరాజు, ప్రధాన కార్యదర్శి మాలోతు నగేష్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం బూరుగు రమేష్, నాయకులు గనిమల్ల శ్రీరాములు, గోన దేవ్‌కుమార్, ఇరిగి స్వామి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

సంఘాల్లోకి మహిళలను ఆహ్వానించాలి

అదనపు డీఆర్డీవో శ్రవణ్‌కుమార్



మహిళా సంఘాల సభ్యులతో అదనపు డీఆర్డీవో శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఏ సంఘంలో లేని మహిళలను ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు సంఘాల్లోకి ఆహ్వానిస్తామని అదనపు డీఆర్డీవో ఎం.శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన కళాజాతను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు మహిళలందరికీ సంఘాల్లో చేరుస్తామన్నారు. కిశోర బాలికలకు, దివ్యాంగులకు, వృద్ధులకు సంఘాలు ఏర్పాటు చేసి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణానికి ప్రభుత్వం నుంచి వచ్చిన వడ్డీ రాయితిని పంపిణీ చేస్తామన్నారు. గత ఏడాది ఫిబ్రవరి తరువాత రుణం తీసుకొని ప్రమాదానికి గురై, లేదా సాధారణ మరణం చెందిన మహిళల కుటుంబాలకు ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులు అందజేస్తామన్నారు. తీసుకున్న రుణాలను రికవరీ చేయడం, రుణం పొంది విజయవంతంగా వ్యాపారం నిర్వహిస్తున్న మహిళలకు సన్మానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు బాషపాక చంద్రశేఖర్, ప్రభాకర్, సీసీలు సైదులు, నాగయ్య, స్వాగత్‌రావు, కళాజాత సభ్యులు ప్రతాప్, మల్లిక, సైదమ్మ, కొండలు, శ్రీను, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బధిరులకు ప్రత్యేక జాబ్ మేళా

మిర్యాలగూడ టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బధిరుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్ పూర్తి చేసి, 18 నుంచి 24 సంవత్సరాల లోపు గల అభ్యర్థులకు పేరొందిన సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విధులు సమర్థంగా నిర్వహించిన ఉద్యోగులకు గుర్తింపు

దేవరకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి):అంకితభావంతో విధులు సమర్థవంతంగా నిర్వహించిన ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని దేవరకొండ ఆర్టీసీ డీఎం తల్లాడ రమేష్ బాబు అన్నారు. డిపోలో పనిచేస్తున్న మెకానిక్‌లు కేవస్ రెడ్డి, మోతీలాల్, కోదాడ, యాదగిరిగుట్ట డిపోలకు బదిలీ సందర్భంగా బుధవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో వారిని ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, అసిస్టెంట్ ఇంజనీర్ కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణస్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

నాగార్జునసాగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్ కాలనీలో ఉన్న సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రాధయ్య, రామానుజం, వెంకటాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం ఉదయం నుంచి విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పారాయణంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

సమస్యలతో సహవాసం

దేవరకొండ మునిసిపాలిటీలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అధ్వానంగా మారిన అంతర్గత రహదారులు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ, ఒక పక్క నీటి సమస్యతో మరో వైపు పట్టణ ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దోమలు, కోతుల బెడద, పలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు.
- (ఆంధ్రజ్యోతి, దేవరకొండ)

- దేవరకొండలో మౌలిక వసతులు కరువు
- మునిసిపాలిటీలో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలు
- పరిష్కరించాలని వేడుకోలు



ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్లు, చెత్తా చెదారంతో నిండిపోయిన డ్రైనేజీ

దేవరకొండ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం 8 వార్డులకే పరిమితమైంది. మరో 12 వార్డుల్లో పూర్తిస్థాయిలో డ్రైనేజీ నిర్మించాల్సి ఉంది. రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్లు మంజూరైనా రూ.30కోట్లతో పనులు చేపట్టారు. మరో రూ.20 కోట్ల రోడ్ల నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. పట్టణ ప్రజలు డ్రైనేజీ, రోడ్డు, పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరాకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపాలిటీలో 20 వార్డులకుగాను 42కు పైగా కాలనీలు ఉన్నాయి. 8500 గృహాలు ఉండగా 50వేల వరకు జనాభా ఉంది.

పట్టణంలోని 2వ వార్డు, హనుమాన్‌నగర్, రహదారిబంగ్లా, బీఎస్‌ఆర్ కాలనీ, ఖిల్లాబజార్, మున్సిఫ్ కోర్టు, అంజయ్యకాలనీ, తాటికోలు రోడ్డు కాలనీల రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. టెండర్లు పిలిచి రోడ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలి.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి రూ.50 కోట్లు కేటాయించి 8 వార్డుల్లో పూర్తి చేశారు. పట్టణంలోని పాతబజార్, ఖిల్లాబజార్, గాంధీనగర్, పలు వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాల్సి ఉంది. వర్షాలు వస్తే రోడ్లపైనే నీరు పారుతోంది. దీంతో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవరకొండ మునిసిపాలిటీకి ప్రతీ రోజు 43 లక్షల లీటర్ల కృష్ణాజలాలు సరఫరా అవుతున్నాయి. కానీ ఇటీవల తరచుగా పైప్‌లైన్లు పగలడం, విద్యుత్ సమస్య, సాంకేతిక లోపాలతో తరచూ కృష్ణాజలాల సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీంతో కాలనీలకు 3, 4 రోజులకు ఒక్కసారి నీరు సరఫరా చేస్తుండటంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవరకొండ ఖిల్లాతో పాటు ముత్యాలమ్మబజార్, బంజార్ భవన్, సంజయ్‌కాలనీల్లో పార్కులు ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లేకపోవడంతో పార్కులోని ఆట వస్తువులు ధ్వంసమవుతున్నాయి. ఖిల్లాలో రూ.5 కోట్లతో పార్కు నిర్మాణం చేపట్టినా పర్యాటకులకు, స్థానికులకు సౌకర్యాలు కల్పించలేదు. దీంతో పర్యాటకులు ఇబ్బందులు పడే పరిస్థితి. పట్టణంలోని గాంధీనగర్, 2వ వార్డు, హనుమాన్‌నగర్, ఖిల్లాబజార్, సంజయ కాలనీల ప్రజలు కోతులబెడదతో అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో కాలనీల్లో దోమల బెడద అధికమైంది. మునిసిపల్ అధికారులు ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పట్టణ ప్రగతిలో సమస్య పరిష్కారం

దేవరకొండ మునిసిపాలిటీలో వంద రోజుల పట్టణ ప్రగతి ప్రణాళికలో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మునిసిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మునిసిపల్ ఉద్యోగులు, వార్డు ఆఫీసర్లు, వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే రూ.30 కోట్లతో పలు వార్డుల్లో రోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. మరో రూ.20 కోట్లతో టెండర్లు పిలిచి అన్ని కాలనీలకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మునిసిపాలిటీలో సమీకృత మార్కెట్‌ని ర్మాణం చేపట్టకపోవడంతో కూరగాయలు, మాంసం విక్రయదారులు రోడ్లపైనే విక్రయిస్తున్నారు.

గుంతలమయమైన రోడ్లతో ప్రమాదాలు



గాంధీబజార్ నుంచి బొడ్రాయిబజార్ 2వ వార్డుకు వెళ్లే రోడ్డు గుంతలమయమై ప్ర మాదాలు జరుగుతున్నాయి. రోడ్ల నిర్మాణాలు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలి.
-కుల్‌కుందాకార్ శ్రీను, ఖిల్లాబజార్

సమస్యలు పరిష్కరించాలి



దేవరకొండ మునిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు, కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దోమల బెడద అధికమైంది. ప్రారంభించిన రోడ్లను వేగవంతంగా పూర్తి చేయాలి. కోతుల బెడదను అరికట్టి సమస్యలు పరిష్కరించాలి.
- నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, ముత్యాలమ్మబజార్, దేవరకొండ

సమస్యలను పరిష్కరిస్తాం



వంద రోజుల ప్రణాళికలో మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. రోడ్ల నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రూ.30 కోట్లతో రోడ్ల పనులు జరుగుతుండగా రూ.20 కోట్ల పనులకు టెండర్లు పిలిచి కాలనీలకు రోడ్ల నిర్మాణం చేపడుతాం. ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
-సుదర్శన్, మునిసిపల్ కమిషనర్, దేవరకొండ

సార్వత్రిక సమ్మె విజయవంతం

- వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు
- పలుచోట్ల ర్యాలీలు, రాస్తారోకోలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో సమ్మె విజయవంతమైంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీలు, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. పోరాడి సాధించుకున్న 29 లేబర్ చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. పెట్టుబడిదారుల మెప్పు కోసం కేంద్రప్రభుత్వం కార్మికులను బలి చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థను ప్రైవేటు పరం చేయవద్దని ఉద్యోగులు నినదించారు.

● మిర్యాలగూడ పట్టణంలో ప్రజా సంఘా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హమాలీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, ఏఐకేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నాగయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా నాయకులు దుండిగల అంజయ్య, టీఎన్‌టీయూసీ నాయకులు అంజిబాబు, వివిధ పార్టీలు సంఘాల నాయకులు బంటు వెంకటేశ్వర్లు, సయీద్, చాంద్ పాషా, బాలస్వామి, రామయ్య, బిక్షమయ్య, హరికృష్ణ, పాల్గొన్నారు.

కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో గేటు కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి సయ్యద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లు గౌతంరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాండు రంగయ్య, కార్మిక నాయకులు పాల్గొన్నారు. విద్యుత్ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసచారి, ఏడీఈ రవినాయక్, జేఏసీ నాయకులు రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ బస్టాండ్ ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లు గౌతంరెడ్డి, సయీద్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగయ్య, వినయ్‌కుమార్, కోటయ్య, వెంకన్న, మాధవరెడ్డి పాల్గొన్నారు.

● దామరచర్లలో ప్రజాసంఘాల నాయకులు రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వినోద్‌నాయక్, ఉదయ్‌కుమార్, ఎర్రనాయక్, దయానంద్, నాయకులుపాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నాగమణి, పుల్లెంల శ్రీకర్, నర్సయ్య, యాదమ్మ, రేణుక, సరిత, సునీత, జానకమ్మ పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్‌లో సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్ బషీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కార్మిక సంఘం నాయకులు గజ్జల కొండలు, నాగార్జున, గోవిందు, వెంకట్‌రెడ్డి, శ్యాం, కాశయ్య పాల్గొన్నారు. జెన్‌కో ఉద్యోగులు, ఇంజనీర్లు, కార్మికులు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య, సంజీవరెడ్డి, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

● చింతపల్లిలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ఉజ్జిని అంజల్‌రావు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సైదులు, నాయకులు బుచ్చయ్య, రాములు పాల్గొన్నారు.

● వేములపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకుడు పాల్వాయి రాం రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నిడమనూరులో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెలో నాయకులు కందుకూరి కోటేష్, కుంచం శేఖర్, కోదండ చరణ్‌రాజ్, వింజమూరి శివ, ముత్యాల కేశవులు, విష్ణు, బారెడ్డి అనూష, మమత, ధనమ్మ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● దేవరకొండ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులడు పల్లా నర్సింహారెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి నల్ల వెంకటయ్య మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేసేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నూనె రామస్వామి, వలమాల ఆంజనేయులు, దేపసుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, జ్యోతిబసు, యాదగిరి పాల్గొన్నారు.

● డిండిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీరామదాసు కనకచారి, ఎండి.మైనొద్దిన్, బొల్లె శైలేజ్, వెంకటేశ్వర్లు, ఎనమళ్ల నవీన్, వంకేశ్వరం చక్రి పాల్గొన్నారు.

● హాలియాలో నిర్వహించిన కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, బీఆర్‌టీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు పొదిల శ్రీను, అన్వర్ వివిధ సంఘాల నాయకులు రెబెల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ హుస్సేన్, ఏసోబు, చిరంజీవి, కాట్నం వెంకటయ్యం, పొదిల వెంకన్న, కేశాని యాదయ్య, శ్రీను, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవూరలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె.బషీర్, వివిధ సంఘా నాయకులు చిరు నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, ఊరే ప్రభాకర్, బొడ్డు మల్లేష్, వెంకటయ్య, శ్రీను, వెంకటమ్మ, దుర్గయ్య, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఆర్టీసీ, వివిధ సంఘాల నాయకులు హరి, చరణ్‌రెడ్డి, రమావత్ సోమ్లా, వెంకటయ్య, ఆదిరాల శ్రీను, శ్రీరాములు, జంగయ్య పాల్గొన్నారు.



మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



నాగార్జునసాగర్ జెన్‌కో కార్యాలయంల వద్ద జాతీయ సమ్మెకు సంఘీబావం తెలుపుతున్న జెన్‌కో ఉద్యోగులు



మిర్యాలగూడలో బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ కార్మికులు



దేవరకొండలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హాలియా, జూలై 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి అన్నారు. హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. గ్రామాల్లో యువజన కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడు మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు దీరావత్ హరినాయక్, నాయకులు మేకల శ్రీకాంత్, నకిరేకంటి సైదులు, కమతం జగదీశ్వర్‌రెడ్డి, ఐతగోని మధు, వసంత్‌కుమార్, బాలకృష్ణ, సందీప్‌రెడ్డి, జానయ్య, వేణుగౌడ్, నర్సింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉత్తమ ర్యాంకులు

మిర్యాలగూడటౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి తే ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చని ఆదిత్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఇండియన్ ఒలంపియాడ్ టెస్ట్‌లో రాష్ట్రస్థా యి 6వ ర్యాంకు సాధించిన ఎనిమిదో తరగతి విద్యార్థి వి.జైత్రను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ పరీక్షలు విద్యార్థుల్లో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీస్తాయన్నారు. అదే పరీక్షలో ఎం.జశ్వన్‌తేజ్ రాష్ట్రసాయి 20వ ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులకు ఒలింపియాడ్ సంస్థ జారీ చేసిన మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎగ్జామ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య పాఠశాల యాజమాన్యం

వడివడిగా కృష్ణమ్మ రాక

(5వపేజీ తరువాయి)

అవసరాలకు ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1,500 క్యూసెక్కులు, మొత్తం 4,646 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి, రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 1,17,868 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదలచేస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున సాగర్ నీటిమట్టం 503.30 అడుగులుగా (120.5754 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి, వరద కాల్వకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు.



538.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

ఏటా ఆగస్టులోనే నీటి విడుదల

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు ఏటా ఆగస్టు నెలలోనే సాగు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ హాలిడేగా ప్రకటించింది. దీంతో ఆ ఏడాది సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ ఆయకట్టులో బోర్లు, బావుల కింద సుమారు లక్ష ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో 6లక్షల ఎకరాలకు సాగునీరు లేక 2023లో బీళ్లువారాయి. 2024-25 వ్యవసాయ సంవత్సరంలో సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక జూలై నెలలో ప్రారంభం కావడంతో ఆగస్టు 2వ తేదీ నుంచి ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి : మంగేష్‌కుమార్, జెన్‌కో సీఈ

సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాం.సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం 8 టర్బైన్‌లు ఉన్నాయి. అందులో మొదటి టర్బైన్ సామర్థ్యం 110 మిలియన్ యూనిట్లు కాగా, మిగిలిన ఏడు టర్బైన్‌ల ఒక్కో దాని సామర్థ్యం 100.8 మిలియన్ యూనిట్లు. కాగా మొదటి టర్బైన్ మరమ్మతులు కొనసాగుతుండటంతో మిగిలిన ఏడు టర్బైన్‌లలో మంగళవారం రాత్రి 7 నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు విద్యుత్ ఉత్పత్తి చేశాం. ఏడు టర్బైన్ల ద్వారా 2.5మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాం. ఈ ఏడాది సాగర్‌కు ముందస్తుగా వరద రాక మొదలవడంతో విద్యుత్ ఉత్పత్తి పూర్తిస్థాయిలో చేస్తాం. మొదటి టర్బైన్ మరమ్మతులు ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తవుతాయి.

ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి

నేరేడుగొమ్ము, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలో బుధవారం బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, మృతి చెందిన వారి పేర్లను పరిశీలించి జాబితా నుంచి తొలగించాలని కోరారు. ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పేర్లలో తప్పులు ఉంటే తొలగించాలన్నారు. కార్యక్రమంలో నేరేడుగొమ్ము తహసీల్దార్ ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

విద్యార్థులకు మెనూను సక్రమంగా పాటించాలి

విద్యార్థులకు మెనూను సక్రమంగా పాటించాలని ఆర్డీవో రమణారెడ్డి సూచించారు. బుధవారం నేరేడుగొమ్ము కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం సక్రమంగా అందించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శిరీషను విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఉమాదేవి ఉన్నారు.

చెర్వుగట్టు టెండర్ షరతుల్లో దిద్దుబాటు!

(5వపేజీ తరువాయి)

తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ ప్రభావం మిగతా టెండర్లపై చూపడంతో బకాయిల జాబితా పెరిగింది. కొన్ని టెండర్‌ల కాలపరిమితి పూర్తయినా బకాయిలను సొమ్మును చెల్లించకుండా వ్యాపారాలు సాగలేదని, నష్టం వచ్చిందనే సాకులు చెబుతూ ఎగ్గొట్టే ప్రయత్నం చేశారు. బినామీల ద్వారా వేలంలో పాల్గొని వారు మళ్లీ హక్కులు పొందుతున్నారు. ఇదిలా ఉండగా, దేవస్థాన సిబ్బంది రాజకీయ జోక్యం ఉన్న టెండర్‌దారులతో ఒకలా, మిగతా వారితో మరోలా వ్యవహరించారనే విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో ఈవో దిద్దుబాటు చర్యలను చేపట్టారు.

తాజా టెండర్ నుంచే మార్పు

చెర్వుగట్టు గుట్టపై కొబ్బరికాయల విక్రయ హక్కు పొందేందుకు బుధవారం ఈవో కార్యాలయం వద్ద సీల్డ్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ తాజా టెండర్ షెడ్యూల్‌లోని నిబంధనలను మార్చారు. దాని ప్రకారం టెండర్ దక్కించుకున్నవారు 72 గంటల్లో సొమ్ము చెల్లించాలని షరతు విధించారు. దీంతో పాటు మరో రెండు చిన్న నిబంధనలను కూడా సవరించారు.

కొబ్బరికాయల విక్రయ వేలం వాయిదా

చెర్వుగట్టు గుట్టపై ఏడాది కాలపరిమితికి నిర్వహించిన కొబ్బరికాయల విక్రయ హక్కు వేలం వాయిదా పడింది. సరైన ధర రానందున వేలం నిబంధనల మేరకు వాయిదా వేస్తున్నామని, తదుపరి వేలం తేదీని ప్రకటిస్తామని ఈవో ప్రకటించారు.

అన్ని టెండర్‌లకూ ఇదే నిబంధన

దేవస్థానం పరిధిలో నిర్వహించే అన్ని టెండర్లకు ఇక పై కొత్త నిబంధన వర్తిస్తుంది. గతంలో టెండర్ దక్కించుకున్నవారు 50శాతం డబ్బులను చెల్లించి, మిగతా మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించాం. ఈ వెసులుబాటును కొందరు దుర్వినియోగం చేశారు. బకాయిలు చెల్లించకపోగా తిరిగి నిందలు వేశారు. అందుకే ఇకపై అన్ని టెండర్లకూ నూతన నిబంధనలు వర్తింపజేస్తాం.
- సిరికొండ నవీన్ కుమార్, ఈవో